
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 28.10.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 21 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## రాజకీయ పెద్దలు... అవినీతి గద్దలు

### వేల కోట్లు ఎగ్గొడుతున్న కార్పొరేట్ రాబందులు









ఎన్ని కోట్లమంది ప్రజలు రూపాయి రూపాయి దాచుకుంటే బ్యాంకుల్లో వందలకోట్లు అవుతాయి... ఎంతమంది వ్యాపారులు, ఎంతమంది మదుపర్లు వేలు, లక్షలు లెక్కన డిపాజిట్లు చేస్తే బ్యాంకుల్లో వేల కోట్లు జమపడతాయి. ఈ కోట్లాదిమంది కట్టిన డిపాజిట్లు చివరకు ఏమవుతున్నాయి. ఎవరి చేతుల్లోకి పోతున్నాయి. ఎవరి స్వార్ధానికి స్వాహా అవుతున్నాయి. (మిగతా 11వ పేజీలో)




## నెల్లూరులో అభినవ మాల్యా

### బ్యాంకు బకాయిల మేటి ఎమ్మెల్సీ వాకాటి



నెల్లూరుజిల్లా ప్రజలకు షాక్‌లాంటి వార్త ఇది. ఎప్పుడు చూసినా ఉదయం బ్రేక్‌ఫాస్ట్ రాహుల్‌గాంధీతో, మధ్యాహ్నం లంచ్ సోనియా గాంధీతో, సాయంత్రం డిన్నర్ అహ్మద్‌పటేల్‌తో (మిగతా 11వ పేజీలో)


## బెర్త్ ఖాయం..?

- జిల్లా 'దేశం' కేడర్‌కు దీపావళి కానుక
- పనిచేసే లీడర్‌కు సరైన వేదిక



తెలుగుదేశం నాయకులు, వైకాపా నుండి తెలుగుదేశంలో చేరిన ఎమ్మెల్యేలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ దీపావళి పండుగ పోగానే ఉండబోతోంది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి స్పష్టమైన సంకేతాలు అందినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ కోసమే ఇటీవల చంద్రబాబు గవర్నర్ నరసింహన్‌తో సమావేశమైనట్లు తెలిసింది.

మంత్రివర్గ విస్తరణ జరిగితే పాత కేసులు ముగ్గురు నుండి నలుగురు దాకా ఔట్ కావచ్చు. వైకాపా నుండి చేరిన ఎమ్మెల్యేలలో ఓ నలుగురికి మంత్రి పదవులు ఇస్తామని ప్రామిస్ చేసివున్నారు. రాజకీయ సాంకేతిక కారణాల రీత్యా వారిని మంత్రివర్గంలోకి తీసుకోవడం సందేహంగానే వుంది. (మిగతా 11వ పేజీలో)





వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ముక్కాల ద్వారకానాథ్‌ను బుధవారం నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందిస్తున్న మిత్రులు

# వైయస్సార్సీపీలో పలువురికి పదవులు

వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరుజిల్లాకు చెందిన పలువురికి పార్టీలో పదవులు ఇస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ముక్కాల ద్వారకానాథ్, జిల్లా కార్య దర్శిగా తుమ్మల వెంకయ్యనాయుడు, జిల్లా సంయుక్త కార్యదర్శిగా కంభం వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా అధికారప్రతినిధిగా మందల వెంకటశేషయ్యలను నియమించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి మండలాధ్యక్షుడిగా నోటి శ్రీనివాసులురెడ్డి, ఉదయగిరి మండలానికి మూలే సుబ్బారెడ్డి, వరికుంటపాడుకు గుంటుపల్లి నాగభూషణం, వింజ మూరుకు మలిరెడ్డి రంగారెడ్డి, సీతారామపురానికి పానెం వెంకటరమణయ్య, జలదంకికి పాలవల్లి మాలకొండారెడ్డి, దుత్తలూరుకు చేజర్ల భాస్కరరెడ్డి, నెల్లూరురూరల్ మండల ప్రధాన కార్యదర్శిగా మలినేని వేణుగోపాల్‌ను నియమించారు.


# నెత్తురు చిందిన నేల

## ముగ్గురి కిరాతక హత్య




నెల్లూరుజిల్లా కలిగిరి పంచాయితి పరిధిలోని పావనముసలిపాలెం గ్రామంలో పొలం తగాదాల కారణంగా ముగ్గురు వ్యక్తులు దారుణంగా హత్యకు గురయ్యారు. 21వ తేదీ మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో గ్రామ పొలాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతుల బంధువర్గాల కథనం మేరకు కలిగిరి మండలం కుమ్మరకొండూరుకు చెందిన సానా మహేంద్రరెడ్డి(38), వీరా రెడ్డిపాలెంకు చెందిన కొండ్రెడ్డి సుబ్బారెడ్డి (40), అనంతసాగరం మండలం వెంగం పల్లికి చెందిన సానా సుబ్బారెడ్డి(40) సమీప బంధువులు. వీరు ముగ్గురు నెల్లూరులో వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం ద్వారా సంపాదించిన డబ్బుతో సానా మహేంద్రరెడ్డి, కొండ్రెడ్డి సుబ్బారెడ్డి తమ సొంత మండలంలోని పావనముసిలి పాలెం గ్రామంలో వెంకన్నపాలెం గ్రామ సర్వేనెం.1లో 12.50ఎకరాల భూమిని రిజిష్టరు కొనుగోలు చేసారు. మూడేళ్ల క్రితం ఈ పొలాన్ని విజయవాడకు చెందిన కంచర్ల జనార్ధన్ వద్ద వీరు కొనుగోలు చేసారు. అయితే అదే గ్రామానికి చెందిన గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి కుటుంబసభ్యులు తాము 30ఏళ్ల క్రితమే ఈ పొలాన్ని అగ్రిమెంటు కొనుగోలు చేసామని, మీ రిజిష్టరు కొనుగోలు చెల్ల దంటూ వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ విషయమై ఇరువర్గాల వారు కావలి సివిల్ కోర్టులో కేసులు వేసుకున్నారు. గత రెండేళ్లుగా ఈ కేసులు కోర్టులో నడుస్తు న్నాయి. ఈ నేపథ్యంలో మహేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి ఈ నెల 21వ తేదీ తమ పొలంలో గట్లపై ఉన్న చిల్లకట్టెలను కూలీలతో కొట్టిస్తున్నారు. విషయం తెలుసు కున్న గణేశం వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబ సభ్యులు కూలీల వద్దకు వచ్చి వారిని అడ్డుకున్నారు. కూలీలు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా మహేంద్రరెడ్డికి తెలిపారు. ఆ సమయానికి కలిగిరిలో ఉన్న మహేంద్ర రెడ్డి, కొండ్రెడ్డి సుబ్బారెడ్డి, సానా సుబ్బారెడ్డి కారులో బయలుదేరి పావనముసిలిపాలెం పొలానికి చేరుకున్నారు. ముందుగానే వీరిని మట్టుబెట్టే పథకంతో గొడవకు వచ్చిన గణేశం వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబీకులు వీరి ముగ్గురితో వాగ్వివాదానికి దిగారు. ఉన్నట్లుండి తమ వెంట తెచ్చుకున్న కారం పొడిని వారి కళ్లలో చల్లి కిందపడేసి చిల్లకట్టెలతో దారుణంగా కొట్టి హత మార్చారు. అనంతరం నిందితులు గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి కలిగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. కలిగిరి, కొండాపురం, వింజమూరు ఎస్ఐలు ఖాదర్‌బాషా, రమేష్‌బాబు, ప్రతాప్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

మొత్తం 8మంది ఈ దాడిలో పాల్గొ న్నట్లు తెలుస్తోంది. వారిలో నలుగురు మహిళలు కూడా ఉండడం విస్తు గొలి పింది. ఈ దాడి నుండి మరో ఇద్దరు ప్రాణాలతో బయట పడ్డారు.




## వాకర్స్ ఇంటర్నేషనల్
## ఉపాధ్యక్షుడిగా సుబ్బారెడ్డి



వాకర్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడిగా ఎం.వి. సుబ్బారెడ్డి ఎంపిక య్యారు. సుబ్బారెడ్డి వాకర్స్ సంఘంలో గత కొన్ని సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో వాకర్స్ సంఘాలను సమన్వయ పరచి వాటి ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు అందేలా కృషి చేశారు. ఈయన ఎంపికపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## 'యాదె రఫీ'లో
# విపిఆర్ "గానా"



అమరగాయకుడు మహమ్మద్ రఫీ 36వ వర్ధంతి సందర్భంగా ఆ మహాగాయకుడిని సంస్మరించుకుంటూ అక్టోబర్ 23వ తేదీ ఆదివారం నెల్లూరులో సంగీత విభావరి జరిగింది.

కళారాధకుడు, కళాప్రియుడు, కళాపోషకుడు మహ్మద్ రఫీ అభిమాని, ప్రముఖ సంఘసేవకుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్న ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మహమ్మద్ రఫీ పాటలపై తనకున్న మక్కువను చాటుకోవడంతో పాటు రఫీ ఆలపించిన పాటలోని ఓ చరణం పాడి సభికులను ఆకట్టుకున్నారు. చేతలే తప్ప ఎక్కడా మాటను వినిపించని విపిఆర్ ఏకంగా 'గానం' అందుకోవడం అందరినీ ఆనందపరచింది. యాదేరఫీ పేర నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది.

## ఢిల్లీలో అలరించిన..
# నిరోషా నృత్యం



ఎంతో కష్టసాధ్యమైన కూచిపూడి నృత్యాన్ని సాధనచేయాలంటే అందుకు ఎంతో పట్టుదల, కృషి అవసరం. అందులోనూ ఆ కళలో ప్రజ్ఞాపాటవాలు సాధించాలంటే మరింత దీక్షతో పాటు, సహజ నాట్యకళాభినయం ఎంతో ముఖ్యం. కళల పట్ల తదేకమైన ఆరాధనాభావంతో వున్న వారే భారతీయ సంప్రదాయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం వంటి కళలలో రాణించగలరు. అందులోనూ అమెరికాలో పుట్టి అక్కడి సంస్కృతి సంప్రదాయాలను అలవరుచుకుంటున్న నేటితరం వారికి ఇది అసాధ్యమైన పని. ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తోంది చిరంజీవి నిరోషా. నిత్య నాట్యసాధనతో.. కూచిపూడిలో అమోఘమైన ప్రజ్ఞాపాటవాలతో భారతీయ సంస్కృతి పట్ల తనకున్న మమకారాన్ని చాటుకుంటోంది. ఢిల్లీలో ఇటీవల నిరోషా సన్నారెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. చిన్నారి నిరోషాకు చిన్నతనం నుంచే నాట్యమంటే ఎంతో ఇష్టం. అందులోనూ కూచిపూడి నృత్యంపై మక్కువ ఎక్కువ. తండ్రి ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి కళలంటే ఆయనకూ ఎంతో అభిమానం. అందుకే, తన కుమార్తె ఆకాంక్షకు తగ్గట్టుగా ప్రోత్సాహం అందిస్తూ కళలకు తనవంతు చేయూతనందిస్తున్నారాయన. కూచిపూడి నృత్యంలో అపారమైన పరిజ్ఞానం వున్న అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యుడు కీర్తిశేషులు వెంపటి చినసత్యం కుమారుడు వెంపటి రవిశంకర్ వద్ద నాట్యరీతులను అభ్యసిస్తూ కుమారి నిరోషా కూచిపూడి నృత్యంలో మేటిగా రాణిస్తోంది. పలుచోట్ల నృత్యప్రదర్శనలిచ్చి అందరి అభినందనలను.. ఆశీస్సులనూ అందుకుంటోంది. అక్టోబర్ 22న ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్‌భవన్‌లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కుమారి నిరోషా ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అందరి కరతాళ ధ్వనులందుకున్నాయి. కూచిపూడిలో ఎంతో విశిష్టమైన 'జయము జయము', 'మహాలక్ష్మి అష్టకం'లను కూచిపూడి నాట్యంలో అత్యద్భుతంగా అభినయించి కుమారి నిరోషా అందరి హర్షధ్వానాలు అందుకుంది. అనంతరం పద్మభూషణ్ వెంపటి చినసత్యం కుమారుడు వెంపటి రవిశంకర్ బృందం ప్రదర్శించిన 'శ్రీకృష్ణ పారిజాతం' నృత్యరూపకం కళాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రత్యేకించి 'సత్యభామ'గా శ్రీమతి వెంపటి ప్రియాంక నాట్యాభినయం ఆద్యంతం అందరినీ అలరించింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో చివరి రోజు (23వ తేదీ) సాయంత్రం శ్రీ వెంపటి రవిశంకర్ శిష్యులు గిరీష్ చంద్ర, దేవి గిరీష్‌ల కూచిపూడి యుగళ నృత్యం, డా. వేదాంతం వెంకట నాగచలపతి బృందంవారు ప్రదర్శించిన 'భక్తప్రహ్లాద' యక్షగానం ప్రేక్షకులకు కనువిందుచేశాయి. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ప్రముఖ పారిశ్రామికవేత్త రవి సన్నారెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి మమతల ప్రోత్సాహంతో వారి కుమార్తె కుమారి నిరోషా కూచిపూడి నాట్యంలో నిరంతర సాధనచేస్తూండడం, తన నాట్యప్రదర్శనలతో అందరి ప్రశంసలు అందుకుంటుండడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ఈ సందర్భంగా విచ్చేసిన పలువురు ప్రముఖులు ప్రశంసించారు. కళల పట్ల వారికున్న మక్కువకు ఇది నిదర్శనమని కొనియాడారు. కూచిపూడి నృత్యాన్ని పదికాలాలపాటు బతికించాలనే వారి సంకల్పానికి ఇంతకంటే ఉదాహరణ ఏమి కావాలన్నారు. అమ్మానాన్నల ప్రోత్సాహంతో నాట్యం పట్ల, భారతీయ సంస్కృతి పట్ల మక్కువతో కూచిపూడి నాట్యంలో ప్రతిభాపాటవాలతో రాణిస్తూ అందరినీ అలరిస్తున్న చిన్నారి నిరోషాకు 'లాయర్' అభినందనలు.

## అందులో స్వార్థం లేదు...
# ఉన్నది సేవాపరమార్థమే!

### రిత్విక్ ఎన్‌క్లేవ్ స్థల వివాదంపై స్వర్ణభారత్ ట్రస్ట్ వివరణ

నెల్లూరు నగరం రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని 16సెంట్ల రిజర్వ్ స్థలంలో స్వర్ణభారత్ ట్రస్ట్ వారు పేద ప్రజల వైద్య సహాయార్థం ఉచిత కంటి, దంత వైద్యశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం తెలిసిందే! అయితే ట్రస్ట్ సేవా దృక్పథంతో చేస్తున్న ఈ పనికి రాజకీయ రంగు పులిమిపెట్టారు. నగరపాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం లక్ష్మీపురంలో ఎకరా రిజర్వ్ స్థలాన్ని కొందరికి కట్టబెట్టే ప్రయత్నంలో వుండగా ఆ స్థలానికి సంబంధించిన అక్రమ భాగోతాన్ని కూడా దీనికి ముడిపెట్టారు.

లక్ష్మీపురంలో స్థలాన్ని పక్కాగా ప్లాట్లు వేసి అమ్ముకోవాలనుకుంటున్నారు. ఇందులో ఎవరెవరి వాటాలు ఎంతెంత అన్నది కూడా నిర్ణయమైపోయింది. కాని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో రిజర్వ్ స్థలం పక్కాగా నగరపాలక సంస్థదే! ఇందులో ఎటువంటి అనుమానాలకు తావు లేదు. అయితే రిజర్వ్ స్థలాలన్నింటిని అభివృద్ధి పరిచే స్థితిలో నగరపాలక సంస్థ లేదు. ఉన్న నిధులను అక్రమ మార్గాలలో కొల్లగొట్టడానికే వారికి సమయం చాలడం లేదు. కాబట్టి పలు స్వచ్ఛంధ సంస్థలు, దాతలే ఆయా రిజర్వ్ స్థలాలను పార్క్‌లుగా, క్రీడా మైదానాలుగా అభివృద్ధి చేయడం చూస్తున్నాం. ఈ కోవలోదే రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని రిజర్వ్ స్థలాలు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని 12సెంట్ల రిజర్వ్ స్థలంలో స్వర్ణభారత్ ట్రస్ట్ మరియు ముప్పవరపు ఫౌండేషన్‌లు కలిసి అధునాతన భవనాన్ని నిర్మించి, అందులో గ్రంథాలయం, ఉపాధి కోర్సుల శిక్షణ, చెస్, క్యారమ్స్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణంలోనే బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు నెల్లూరొచ్చినప్పుడు ఉదయాన్నే బ్యాడ్మింటన్ ఆడేది ఇక్కడే! భవనాలు పూర్తయ్యాక 2011లో వీటిని నెల్లూరు నగరపాలక సంస్థకే అప్పగించారు. ఈ స్థలం మీద, ఇందులో వున్న భవనాల మీద నగరపాలక సంస్థకే సర్వహక్కులు ఉన్నాయన్నది వాస్తవం. ఈ భవనంలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులలో వేలాది మంది శిక్షణ పొంది వివిధ విభాగాలలో ఉపాధి అవకాశాలు పొందారు.

ఇదే తరహాలో పేదలకు కంటి, దంత వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో స్వర్ణభారత్ ట్రస్ట్ వారు ఇక్కడే వున్న మరో 16సెంట్ల రిజర్వ్ స్థలంలో కార్పొరేషన్ అనుమతితో ఆసుపత్రి భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ భవనాల మీద సైతం కార్పొరేషన్‌కే హక్కుంటుంది. నెల్లూరు నగర పరిసరాలలో పేదలకు ఉచిత వైద్యం అందించాలన్నదే ఈ భవనాల నిర్మాణంలో ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఈ స్థలాన్ని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడే స్వయంగా వచ్చి ఆక్రమించేస్తున్నాడన్నట్లుగా విమర్శలు చేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల గురించి తెలిసిన వాళ్లెవ్వరూ ఆ ట్రస్ట్‌పై రాజకీయ విమర్శలు చేయరు. ఓ మారుమూల గ్రామంలో నెలకొల్పిన అతిపెద్ద ట్రస్ట్ ఇది. దేశంలోనే ఇలాంటి ట్రస్ట్‌లు అరుదుగా ఉంటాయి. గ్రామీణ ఉపాధికి పెద్దపీట వేస్తూ విద్య ఉపాధి వైద్య రంగాల్లో అనేక సేవలందించడంతో పాటు ఎంతో మందికి వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణనిస్తూ వారి జీవనోపాధికి బాటలువేస్తుంది ఈ ట్రస్ట్.

నెల్లూరులో ఎన్నో రిజర్వ్‌స్థలాలున్నాయి. చాలా స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయి. వాటిలో సొంత ఇళ్లు, వ్యాపార దుకాణాలు కట్టుకుంటున్నారు. రాజకీయ విమర్శలు అలాంటివాటిపై కూడా ఎక్కుపెట్టాలి. రిజర్వ్ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపడుతామంటే... ఒక్క స్వర్ణభారత్ ట్రస్టేంటి... ఎవరినైనా ఆహ్వానిద్దాం. అంతేగాని స్వచ్ఛంధంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం సముచితం కాదు.


## అమ్మ... తొలి వర్ధంతి



1970లో స్వామిదాస్ స్కూల్‌ని స్థాపించినప్పటి నుండి అలుపెరుగని సేవలతో 45సంవత్సరాల పాటు తన చివరి శ్వాస వరకు శ్రమించిన కష్టజీవి అమ్మ.

వేలాది మందిని మేధావులుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దిన పుణ్యజీవి అమ్మ.

ఆడ శిశువు భారం అన్న కాలంలోనే ఆరుమంది అమ్మాయిలకు జన్మనిచ్చి, వారందరినీ అత్యున్నత శిఖరాలకు చేర్చిన ధన్యజీవి అమ్మ.

పన్నెండు మంది మనుమళ్ళు, మనుమరాళ్ళతో పాటు పదమూడు మంది మునిమనుమళ్ళు మునిమనుమరాళ్ళతో పరిపూర్ణ జీవితాన్ని అస్వాదించిన అమృతమూర్తి...

మా హృదయాలలో చెరగని దీప్తి... మా అమ్మ.



అమ్మను స్మరించుకుంటూ...
కుటుంబసభ్యులు

శ్రీమతి లిల్లీ స్వామిదాస్
జననం 26.08.1920 | మరణం 28.10.2015

తొలి వర్ధంతి: అమ్మ తొలి వర్ధంతి అక్టోబర్ 28 శుక్రవారం ఉదయం 11.30గం.లకు బాలాజీనగర్‌లోని స్వామిదాస్ స్కూల్‌లో జరుగుతుంది.

## 'ప్రభా'తం

ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో మొన్న జరిగిన పోలీసుల మెరుపుదాడులు మావోయిస్టులకు.. ఇక కోలుకోలేని ఒక పెద్ద షాక్. ఎంతోకాలంగా మావోయిస్టుల కంచుకోటగా వున్న ఏఓబి (ఆంధ్ర-ఒడిశా బోర్డర్) రక్షణ కవచాన్ని పోలీసులు వూహించనిరీతిలో బద్దలుకొట్టారు. మావోయిస్టులపై ముమ్మర దాడులు చేసి పలువుర్ని మట్టుపెట్టారు. రెండురోజుల పాటు జరిగిన ఈ ఘటన ల్లో మొత్తం 31 మంది మావోయిస్టులు హతమైపోయారు. మృతుల్లో పలువురు మావోయిస్టు కీలకనేతలు కూడా వున్నట్లు సమాచారం. దీంతో దాదాపుగా ఏఓబిలో వున్న ముఖ్యమైన మావోయిస్టులనంతా తుడిచిపెట్టినట్లయిందని భావిస్తున్నారు.

తొలి రోజు జరిగిన ఘటనలో 24 మంది మావోయిస్టులు చనిపోగా, రెండవ రోజు ఘటనలో మరో నలుగురు హతమైపోయారు. ఈ సంఖ్య మరింతగా పెరిగివుండవచ్చని భావిస్తున్నారు. తొలిరోజు ఘటన మావోయిస్టు ఉద్యమ చరిత్రలోనే భారీ ఘటన అనే అనుకోవచ్చు. కాల్పుల్లో పోలీసులు ఒకేసారి 24 మంది మావోయిస్టులను హతమార్చడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. ఈ ఘటనలో మావోయిస్టు అగ్రనేత ఆర్కే కుమారుడు మున్నాతో సహ పలువురు కీలక నేతలు మృతిచెందారు.

రెండవరోజు ఘటనాస్థలికి పోలీసు ఉన్నతాధికారులు హెలికాప్టర్‌లో వెళ్తుండగా అడవుల్లో దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరపడంతో, మళ్ళీ ఎదురు కాల్పులు జరిగాయని, దీంతో మరో నలుగురు మావోయిస్టులు మృతిచెందారని సమాచారం. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ అలియాస్ ఆర్కే ఈ ఘటనల్లో గాయపడినట్లు సమాచారం. దీంతో ఆర్కేతో సహ మిగిలిన మావోయిస్టులందరినీ పట్టుకోవాలని ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన పోలీసులు భారీ భద్రతాదళాలతో ఆ ప్రాంతాన్నంతా జల్లెడ పడుతున్నారు. అడవిదారుల్లో చెక్‌పోస్టులను భారీగా పెంచి అణువణువు గాలి స్తున్నారు. తప్పించుకున్న మరింతమంది మావోయిస్టులను పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశారు.

ఇదిలావుంటే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా వున్నప్పుడు అటు మావోయిస్టుల దాడులు, ఇటు పోలీసుల ఎన్‌కౌంటర్లు తరచూ జరిగినా, ప్రత్యేక తెలుగు రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ఇటీవలికాలంలో మావోయిస్టుల కార్యకలాపాలు పెద్దగా కనిపించలేదు. కానీ గతంలో జరిగిన అనేక సంఘటనల్లో పలువురు పోలీసులు, పోలీసు అధికారులు, పలువురు నాయకులు సైతం మావోయిస్టుల తుపాకులకు బలైపోయారు. 2008లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో వున్న బలిమెల జలాశయం వద్ద వెళ్తున్న 38 మంది పోలీసులను మావోయిస్టులు అత్యంత దారుణంగా కాల్చి చంపారు. అడవులను గాలించి లాంచీలో తిరిగివస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులపై మావోయిస్టులు మెరుపుదాడులు చేసిన ఘటనలో 38 మంది పోలీసు సిబ్బంది కన్నుమూశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే మల్కన్‌గిరి జిల్లాలో భద్రతాసిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు మందుపాతరపెట్టి మరీ పేల్చేశారు. ఈ ఘటనలో మరో 24 మంది భద్రతా సిబ్బంది మృతి చెందారు. ఇక అప్పటినుంచి పోలీసులు మరింత పకడ్బందీ వ్యూహారచనతో మావోయిస్టులపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల వేట ఎప్పటినుంచో కొనసాగుతూనే వుంది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో వారి కదలికలు బాగా వున్నాయని పోలీసులు ఎంతోకాలంగా నిఘా పెట్టివున్నారు.

దీంతో, తాజాగా తమకందిన పకడ్బందీ సమాచారంతో మల్కన్‌గిరి జిల్లా బెజ్జంగి ప్రాంతానికి వెళ్లడం, మావోయిస్టులు-పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో 24 మంది మావోయిస్టులు హతమవడం జరిగిపోయాయి. ఈ ఘటనల్లో ఏఓబిలో వున్న పలువురు మావోయిస్టు అగ్రనేతలు, కీలకనేతలు, దళ నేతలు మరణించడంతో ఆ ప్రాంతమంతా దాదాపు ఖాళీఅయిపోయినట్లేనని, ఇక ఆ ఉద్యమం కూడా చరమదశకు వచ్చినట్లేనని భావిస్తున్నారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, ఎంతో కీలకమైన సెల్‌ఫోన్ వ్యవస్థతో పోలీసులు ఎప్పటికప్పుడు అటవీప్రాంతాల్లో వున్న మావోయిస్టుల జాడ కోసం గాలిస్తున్న తరుణంలో, ఇటీవల లొంగిపోయిన మావోయిస్టుల ద్వారా అందిన పక్కా సమాచారం పోలీసులకు బాగా ఉపయోగపడినట్లు తెలుస్తోంది. సంఘటనాస్థలంలో మావోయిస్టులకు చెందిన భారీ ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇది మావోయిస్టులపై పోలీసులు పైచేయి సాధించడమేనని, అత్యంత సాహసోపేతమైన గ్రేహౌండ్స్ దళాల పోరాటపటిమకు ఈ ఘటనలు ఒక నిదర్శనమని పోలీసువర్గాలు ప్రశంసిస్తున్నాయి. కాగా, ఈ దాడుల్లో గ్రేహౌండ్స్ సీనియర్ కమాండర్ ఒకరు మృతిచెందడం, మరో కమాండర్ గాయాల పాలవడం విచారకరం..

### మావోయిస్టులకు షాక్



ఇటీవల ఏఓబిలో పోలీసులకు-మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మృతిచెందడం మావోయిస్టులకు ఒక పెద్దషాక్. కొందరు కీలకమైన నేతలు సైతం మృతి చెందడం మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని దెబ్బ. అయినా, ప్రగతి కాంతులతో పేదరికపు చీకట్లు తొలగిపోతాయే తప్ప..హింసాత్మక విధానాలతో కాదు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా.. ప్రగతిదారుల్లో కృషిచేయాలే తప్ప..హింసామార్గం మాత్రం... ఏనాటికీ అనుసరణీయం కాదు.

ఏదేమైనా మావోయిస్టు ఉద్యమానికి ఇది కోలుకోలేని దెబ్బ. పేదరికంతో వున్న ఏఓబి లాంటి అటవీప్రాంతాల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఇక పూర్తిగా సమసిపోయినట్లే, అయినా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి హింసాయుత వాతావరణం ఆటంకమే తప్ప ప్రయోజనకారి కాదు. సామాజిక రుగ్మతలు రూపుమాపడానికి, పేదరికం తొలగిపోవడానికి హింసామార్గమే మిన్న అని మావోయిస్టులే కాదు...ఎవరనుకున్నా అది సరైనమార్గం కానే కాదు. ఏ ప్రాంతంలోని ప్రజలైనా సరే శాంతినే కోరుకుంటారు తప్ప హింసని మాత్రం కోరుకోరు.

ప్రజల అభివృద్ధిని కాంక్షించేవారెవరైనా సరే శాంతియుతమైన పద్ధతుల్లో.. ప్రగతిదారిలో కృషి చేయాలే తప్ప, హింసామార్గం ఏనాటికీ అనుసరణీయం కాదు. ప్రగతికాంతులతోనే పేదరికపు చీకట్లు తొలగిపోతాయే తప్ప, హింసాత్మక విధానాలతో చేయగలిగిందేమీ వుండదు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో, శాంతియుతమైన.. సామరస్యపూర్వకమైన వాతావరణంలో, సరైన ఆలోచనాదృక్పథంతో ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం లభిస్తుందే తప్ప, హింసాత్మక విధానాలతో చివరకు సాధించేదేమీ వుండదు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తాం

**- కర్నాటి ఆంజనేయరెడ్డి**



2017 మార్చిలో జరగనున్న ఏపి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరు, ఒంగోలు, చిత్తూరుజిల్లాల ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ స్థానాలకు భారతీయ జనతా పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ నెల్లూరు ఏఎంసి కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల చేర్పుపై పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1987లో ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ రద్దు అయ్యే నాటికి అధిక సంఖ్యలో బీజేపీ ఎమ్మెల్సీలు ఉన్నారన్నారు. తిరిగి శాసనమండలి పునరుద్ధరింపబడిన తర్వాత బీజేపీ ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఈ ఎన్నికల్లో మిత్రపక్షం టీడీపీ సహకారంతో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2013 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తయిన అందరూ ఓటు హక్కు పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఎంపికైన బత్తల కృష్ణయ్యను సన్మానించారు. కందుకూరి సత్యనారాయణ, అల్లంపాటి రమణారెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, కాలం బుజ్జిరెడ్డి, సుధాకర్, నల్లు కామేశ్వరి, పఠాన్ మస్తాన్ పాల్గొన్నారు.

## శబరిమలై, పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

శబరిమలైకు వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. శబరిమలైతో పాటు పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తోంది. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రబాబు ఈనెల 22న ఆ వివరాలను తెలిపే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప భక్తులకు ఈ ఏడాది కూడా ఆర్టీసీ రీజియన్ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేస్తోందని, ఒకేసారి 15 టిక్కెట్లు బుక్ చేసుకున్న బృందానికి అదనంగా ఒకరికి ఉచిత ప్రయాణసౌకర్యం కల్పిస్తామన్నారు. పూర్తిబస్‌ను బుక్‌చేసుకున్నవారికి, ఇద్దరు వంటవారికి, ఇద్దరు మణికంఠ స్వాములకు ఉచిత ప్రయాణసదుపాయం కలిగిస్తున్నామన్నారు. బస్సును బుక్‌చేసుకున్న గురుస్వాములు, ఏజెంట్లకు రోజుకు 5వందల చొప్పున కమిషన్ వుంటుందన్నారు. నవంబర్ 16, 19, 21, 24, డిసెంబర్ 1, 4, 6, 9, 10, 15, 18, 20, 23, 31, జనవరి 2017లో జనవరి 4, 7, 11 తేదీల్లో బస్సులు బయలుదేరుతాయని ఆర్టీసి ఇ.డి తెలిపారు. శబరిమలైకి నాలుగురోజుల యాత్రప్యాకేజీకి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీలో రూ. 3,300, అల్ట్రా డీలక్స్‌లో రూ.3 వేలు, ఎక్స్‌ప్రెస్‌లో రూ. 2,500, తెలుగువెలుగులో రూ.2 వేలు వంతున ఛార్జీలు వుంటాయని, ఈ బస్సులు చెన్నై, శ్రీరంగం, మధురై, కుర్తాళం, ఎరుమేలి, పంబల మీదుగా శబరిమలైకి వెళ్తాయని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా, పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, కార్తీకమాసంలో ఈ క్షేత్రాలకు వెళ్లాలనుకునే భక్తులకు ఈ బస్సులు ఎంతో అనుకూలంగా వుంటాయన్నారు. అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరరామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షరామంలోని భీమేశ్వరామం, సామర్లకోటలోని కామరారామంలకు వెళ్ళేందుకు భక్తులకు ఈ అయిదు కార్తీక సోమవారాల్లో బస్సులు సిద్ధంగా వుంటాయన్నారు. ఈ ప్రత్యేక బస్సులు అక్టోబర్ 30వ తేదీ, నవంబర్ 6, 13, 20 తేదీల్లో వచ్చే ఆదివారాల్లో రాత్రి 10 గంటలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి బయలుదేరుతాయని, సూపర్ లగ్జరీకి రూ. 1950, డీలక్స్‌లో 1875 రూపాయల ఛార్జీ వుంటుందన్నారు.

## చైనా వస్తువులను బహిష్కరిద్దాం

ఇటీవల కాలంలో పాకిస్తాన్ 'శాంతి కాముకమైన భారతదేశం' పైకి ఉగ్రవాదులను జరిపి 18మంది మన సైనికులను పొట్టన పెట్టుకున్నాక, సమర్థులైన మన రక్షక దళం పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పేందుకు 'సర్జికల్ ఆపరేషన్' జరిపి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన సందర్భంగా పాకిస్తాన్ మింగ లేక, కక్కలేకపోయినా, ఐక్యరాజ్య సమితిలో ఆక్రమిత కాశ్మీర్ ప్రస్తావన తెచ్చి ద్వైపాక్షిక సంబంధాలను అంతర్జాతీయ వేదికపైకి తేవడం గర్హనీయం. పాకిస్తాన్‌కు వత్తాసునిస్తూ 'చైనా' అనవసరంగా తలదూర్చడం యుద్ధానికి రెచ్చగొట్టడమే అవుతుంది. దీన్ని ఏక కంఠంతో భారతీయులంతా నిరసించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చైనా దిగుమతులపై నిషేధం విధించాలి. బీహార్ హైకోర్టు ఈ విషయంలో ఆదర్శంగా నిలిచి చైనా వస్తువులపై నిషేధం విధించింది. తక్షణం సుప్రీం కోర్టు దేశవ్యాప్తంగా చైనా వస్తువులపై నిషేధం విధించాలి. బీహార్లోలా ఆంధ్రప్రదేశ్‌లో చైనా వస్తువులను అమ్మితే రూ.2000/- కొంటే రూ.1000/- జరిమానా/పన్ను విధించాలి.

– సి.శారద, కావలి.

## పిచ్చోడి చేతిలో రాయి

తెలంగాణలో 10జిల్లాలను 31జిల్లాలుగా మార్చడం హాస్యాస్పదంగా వుంది. కేసీఆర్ పరిపాలన పిచ్చోడి చేతిలో రాయి చందంగా వుంది. అడిగిన ప్రతి చోటా జిల్లాను ప్రకటించేసాడు. ప్రతి జిల్లాకు అధికారిక వ్యవస్థ రూపంలో ఎంత ఖర్చవుతుందో తెలుసా? ఏపి సీఎం రాష్ట్ర పరిస్థితులు బాగా లేకపోయినా దుబారా చేస్తుంటే తెలంగాణ సీఎం కేసీఆర్ విభజన ద్వారా అప్పనంగా వచ్చిన ఆదాయాన్నంతా ఈ విధంగా తగలేస్తున్నాడు.

వై.యస్.వి.రావు, హైదరాబాద్.

## బాబు ఆస్తుల జోక్

ఈ ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆస్తుల ప్రకటన పెద్ద జోక్ అనుకోవచ్చు. వారి వాస్తవ ఆస్తులకు ప్రకటించిన ఆస్తులకు పొంతన లేదు. రాజకీయ నాయకులెవరూ వారి సొంత పేర్ల మీద ఆస్తులు పెట్టుకోరన్నది బహిరంగ సత్యం. పాలు, కూరగాయలు అమ్మే కోట్ల రూపాయలు సంపాదించామని లోకేష్ చెబుతున్నారు. మరి కూరగాయలు పండించేవాడికి, పాలు పితికే వాడికి ఆ కోట్లు రాలేదేం? అసలు వాళ్లెందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు?

కంచి కృష్ణారెడ్డి, నెల్లూరు.









- పదవులపై నమ్మకం కోల్పోతున్న నేతలు
- 'దేశం' కేడర్‌లో నిరాశ

# ఇక ఇచ్చినా ఏం లాభం?

*అప్పుడే పండిన మామిడి పండును తింటే ఆ రుచేవేరు. కాని అదే పండును వారం తర్వాత పాచిపోయాక తింటే... ఇప్పుడు తెలుగుదేశం నాయకుల పరిస్థితి కూడా అలాగే వుంది. ఇంతకాలం నామినేటెడ్ పదవుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన తెలుగుదేశం నాయకులు ఇక ఎదురుచూపులకు వీడ్కోలు పలుకుతున్నారు. ఇక పదవులు రావని, వచ్చినా వాటితో పీకేదేమీ లేదని ఒక విధమైన నిర్వేదానికి లోనవుతున్నారు.*

ఏ ప్రభుత్వంలోనైనా పదవుల్లో వున్నోళ్లకి మొదటి మూడేళ్లు గోల్డెన్ పిరియడ్ అనుకోవచ్చు. పనులు చేసుకునేది, చేయించుకోగలిగేది అప్పుడే! దండుకున్నా, పిండుకున్నా ఈ మూడేళ్లలోనే జరిగిపోవాలి. ఎలక్షన్‌కు బాగా ఖర్చు పెట్టుంటారు కదా అన్న కోణంలో చంద్రబాబు కూడా పట్టించు కోడు. మూడేళ్లు గడిచిపోయాక మాత్రం గడ్డుకాలం మొదలవుతుంది. ప్రభుత్వం మీద అవినీతి ఆరోపణలు మొదలవుతాయి. చంద్రబాబుకు నీతి నిజాయితీలు గుర్తుకొస్తాయి. అప్పుడే ఎలక్షన్ ట్రెండ్ కూడా ప్రారంభమవు తుంది. ఎవరన్నా అవినీతికి పాల్పడితే సహించేది లేదని చంద్రబాబు వార్నింగ్‌ల మీద వార్నింగ్‌లు ఇస్తుంటాడు. ఇదెలా ఉంటుందంటే మూడు పూటలా మందు తాగే వాడి ముందు బ్లూలేబుల్ బాటిల్ పెట్టి నోరు కట్టేసినట్లుగా ఉంటుంది. ఇప్పుడు ఆయన నామినేటెడ్ పదవులు ఇచ్చినా, నాయకుల పరిస్థితి ఇంతే! కొంచెం గట్టిగానే ఉంటాడు. కాబట్టి మేతకు అవకాశం ఉండదు.

అదీగాక నామినేటెడ్ పదవుల విషయంలో చంద్రబాబు రెండున్నరేళ్లుగా వూరిస్తూనే వున్నాడు. ఏకాదశి, దసరా, దీపావళికి అంటూ నామినేటెడ్ పదవుల పందేరాన్ని సాగదీస్తూనే వున్నాడు. ఇంతకాలం సాగదీసిన చంద్రబాబుకు మిగతా రెండేళ్లు లాగడం పెద్ద సమస్య కాదు. చంద్రబాబు తత్వం గురించి తెలిసిన జిల్లా తెలుగుదేశం నాయకులు క్రమంగా నామినేటెడ్ పదవులపై ఆశలు వదులుకుంటున్నారు. జిల్లా నుండి పార్టీ కోసం అన్ని విధాలా నష్టపోయిన ఓ పదిమంది నాయకుల దాకా నామినేటెడ్ పదవులు ఇవాళ కాకుంటే రేపు రాకపోతాయా అన్నట్లు ఆశపడుతూ వచ్చారు. చంద్రబాబు పద్ధతి మాత్రం... పదవులు రేపు కాకుంటే ఎల్లుండి ఇవ్వక పోతానా అన్నట్లుగా వుంది. ఇక పదవులు రావనే విషయం జిల్లా నాయకులకు ఇప్పు డిప్పుడే అర్థమవుతోంది. ఇప్పుడిచ్చినా చేసేదేమీ లేదన్న బాధ వారిలో కనిపిస్తోంది.



## మినీబైపాస్‌కు...
# కమర్షియల్ లుక్

- మున్సిపల్ ప్లాన్‌లోనేమో రెసిడెన్షియల్ జోన్
- కార్పొరేషన్ రాబడికి గండి

*నెల్లూరు నగరపాలక సంస్థ ఆదాయం పెంచుకోవాలంటే పన్నులు ఒక్కటే మార్గం కాదు, ప్రత్యామ్నాయాలు ఎన్నో ఉన్నాయి. సులభంగా దొరుకుతున్నారు కదా అని చెప్పి ప్రజలను పన్నుల రూపంలో పదేపదే బాదుతుంటే కొన్నాళ్లకు వాళ్లు పన్నులు కట్టడం మానేస్తారు.*

ముఖ్యంగా నగరంలో ఎన్నో రిజర్వ్ స్థలాలున్నాయి. వాటిలో కొన్నింటిని పెయిడ్ పార్కింగ్ జోన్‌లుగా మార్చొచ్చు. దీనివలన నగరపాలక సంస్థకు ఆదాయమే కాక నగరంలో ట్రాఫిక్ సమస్యకు కొంత పరిష్కారం చూపినట్లు కూడా అవుతుంది. ఇక నగరంలో కార్పొరేషన్ స్థలాలు చాలావరకు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎవరో వచ్చి ఆక్రమించుకునే బదులు, కార్పొరేషనే ఆ స్థలాలలో వాణిజ్య సముదాయాలను నిర్మించి బాడుగలకు ఇవ్వొచ్చు. లేదా ప్రైవేట్ వ్యక్తులకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ క్రింది ఇచ్చేసి పెట్టుబడి లేకుండా ఆదాయం పొందవచ్చు.

అన్నింటికంటే కార్పొరేషన్‌కు తక్షణం ఆదాయం పెంచే ప్రక్రియ ఆత్మకూరు బస్టాండ్ నుండి అయ్యప్పగుడి ఫ్లైఓవర్ వరకు మినీబైపాస్ రోడ్ ఇరువైపులా ఒక పరిధిలోపు వున్న ప్రాంతాన్ని కమర్షియల్ జోన్‌గా మార్పుచేయడం. నెల్లూరులో ఈరోజు ట్రంక్‌రోడ్డు తర్వాత అతివేగంగా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం మినీబైపాస్‌రోడ్డే! ఈ రోడ్డును ఆనుకుని అంకణం స్థలం ధర 5లక్షల నుండి 12లక్షల దాకా పలుకుతోంది. పెద్దపెద్ద వ్యాపార సంస్థలన్నీ ఈ రోడ్డు పక్కనే వెలుస్తున్నాయి. పేరుమోసిన బంగారు దుకాణాలు, బట్టల షోరూమ్‌లు, వాహనాల విక్రయ కేంద్రాలు, హోటల్స్, ఆక్వా ఉత్పత్తుల కేంద్రాలు, ప్రైవేట్ ట్రావెల్ ఏజన్సీలు, ఫుడ్‌కోర్టులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, చిన్న చిన్న వాణిజ్య దుకాణాలు ఈ రోడ్డుకిరువైపులా భారీగానే వెలుస్తున్నాయి. ఈ రోడ్డు పక్కన స్థలాలు రెసిడెన్షియల్ జోన్‌లో ఉండడం మూలంగా వ్యాపార సంస్థలు నెలకొల్పాలనుకున్న వాళ్లు ఈ స్థలాలను రెసిడెన్షియల్ జోన్‌లో నుండి కమర్షియల్ జోన్‌లోకి మార్చుకోవాలంటే నానా తంటాలు పడాల్సి వస్తోంది. మాస్టర్‌ప్లాన్‌లో ఈ రోడ్డుకు ఇరువైపులా వున్న ప్రాంతాన్ని కమర్షియల్ జోన్‌లో చేరిస్తే ఆ సమస్య తీరడంతో పాటు నగర పాలక సంస్థ ఆదాయం కూడా పెరుగుతుంది. నగరపాలకులు ఈ విషయంపై దృష్టి సారించాల్సి వుంది.

# శ్రీసిటీలో చైనా మొబైల్ ఫోన్ ఉత్పత్తిదారుల బృందం




చైనాలోని మొబైల్ ఫోన్ ఇండస్ట్రీకి చెందిన 40మంది ఉన్నతశ్రేణి ప్రతినిధుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శిం చింది. ఈ నెల 22, 24తేదీలలో ఢిల్లీలో జరిగిన ఇండియా–చైనా మొబైల్ ఉత్పత్తి దారుల వస్తు ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి నిధుల బృందంలో కొందరు తమ పర్య టనలో భాగంగా శ్రీసిటీకి విచ్చేశారు.

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వీరికి స్వాగతం పలికి, బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో శ్రీసిటీ మౌలిక వసతులను, పారిశ్రామిక ప్రగతిని వారికి వివరించారు. ప్రపం చంలో మొబైల్ ఫోన్ల వినియోగంలో భారత్ ముందుండగా, వాటి ఉత్పత్తిలో చైనా అగ్రగామిగా వుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో అత్య ధిక మొబైల్ ఫోన్లు తయారు చేసే ఫాక్స్‌కాన్ సంస్థ శ్రీసిటీలో వుండడం, తిరుపతి, చెన్నైలో మొబైల్ హబ్ ఏర్పాటు కానుం డడంతో ఈ ప్రాంతం మొబైల్ ఫోన్ల తయారీ వ్యాపారానికి అత్యంత అనుకూ లంగా వుందని ఆయన వివరించారు.

శ్రీసిటీలోని చైనా పరిశ్రమలు ఫాక్స్ కాన్, జడ్‌టీటీ, లాంగీ సంస్థల ప్రతినిధులు చైనా బృంద సభ్యులతో మాట్లాడుతూ పలు అనుకూల కారణాల వలన తమ ఉత్పత్తి కేంద్రాలను శ్రీసిటీలో స్థాపించినట్లు చెప్పారు. సమావేశం అనంతరం ప్రతి నిధుల బృందం శ్రీసిటీలోని పలు చైనా పరిశ్రమలను సందర్శించింది.

# చదువు చెప్పించండి సారూ!

## గవర్నర్‌కు విఎస్‌యూ విద్యార్థి విజ్ఞప్తి



వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఎన్నెన్నో అవకతవకలు, అవినీతి అక్రమాలు జరుగుతుండగా... చివరకు ఫీజులు కట్టిన విద్యార్థులకు చదువులు కూడా సక్రమంగా చెప్పడం లేదు. దీనిపైనే ఓ విద్యార్థి తన ఆవేదనను రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు ఈ–మెయిల్, స్పీడ్‌పోస్ట్ ద్వారా తీసుకెళ్లారు. వర్శిటీలో ఎంబిఏ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులో సెప్టెంబర్ 26న 13,500రూపాయలు ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందినా వర్శిటీ అధికారులు తరగతులు ప్రారంభించి చదువులు చెప్పడం లేదని ఎన్.మదన్‌మోహన్‌రెడ్డి అనే విద్యార్థి పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రభుత్వం నుండి నిధులు పొందే రెగ్యులర్ కోర్సు. ఈ కోర్సు నిర్వహణకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా 40లక్షల రూపాయలను వర్శిటీకి సమకూరు స్తోంది. ఏడు టీచింగ్ పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఒక అసోసియేట్ ప్రొఫె సర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు జీతం తీసుకుంటున్నారు. మరో మూడు పోస్టులు కూడా భర్తీ చేసుకోమని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కాని, వర్శిటీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. తరగతులు ప్రారంభించండని వి.సి వీరయ్యను, రిజిస్ట్రార్ శివశంకర్‌ను, ప్రిన్సిపాల్ వెంకట్రావ్‌ను, టూరిజం కోర్సు హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్ జవహర్‌బాబును ప్రాధేయపడినా పట్టించుకోలేదు. మిగతా కాలేజీలలో ఎంబిఏ, ఎంసిఏ కోర్సులు మొదటి సెమిస్టర్ నిర్వ హించే స్థితిలో ఉన్నాయి. కాని ఇక్కడ మాత్రం తరగతులే ప్రారంభం కాలేదని అతను గవర్నర్‌కు ఫిర్యాదు చేశాడు.

- ఉన్న ఒక్క ఇన్‌ఛార్జ్‌నూ తీసేసారు
- ప్రత్యామ్నాయంగా ఏ హోదా ఇవ్వలేదు!



# మహిళలకిచ్చే గౌరవమిదేనా?

*ఆస్థిలో మహిళలకు సగం హక్కు కల్పించిన మహానీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు. ఆయన ప్రసంగంలో ఎక్కడ విన్నా మొదట వినిపించే పదం "నా తెలుగింటి ఆడపడుచులు, అక్క చెల్లెళ్లు"... మరి అలాంటి మహానీయుడు స్థాపించిన పార్టీలో మహిళలకు ఏ మాత్రం న్యాయం జరుగుతోంది?*

నెల్లూరుజిల్లాలోనే తీసుకుందాం. పార్టీ మహిళా విభాగం నుండి లేదా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల వల్ల గాని వాళ్లకు పదవులు దక్కుతున్నాయి తప్ప, వాస్తవంగా వాళ్లకు ఇస్తున్న ప్రాధాన్యమేంటి? జిల్లాలోని తెలుగుమహిళా నేతలకు నామినేటెడ్ పదవుల పరంగా ఇంతవరకు న్యాయం జరగలేదు. ఇది సరేననుకుంటే ఉన్న పదవులను కూడా తొలగిస్తున్నారు. దీనికి ఉదాహరణే డాక్టర్ బి.జ్యోత్స్నలత. జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే, తెలుగుదేశం పార్టీ తరఫున వున్న ఒకే ఒక మహిళా ఇన్‌ఛార్జ్ డాక్టర్ జ్యోత్స్నలత. 2014 ఎన్నికలకు ముందు వైద్యవృత్తిలో తన పనేదో తాను చేసుకుంటున్న ఆమెను రాజకీయాల్లోకి తెచ్చారు. బల్లి దుర్గాప్రసాద్‌ను పక్కనపెట్టి జ్యోత్స్నలతను గూడూరు తెలుగుదేశం అభ్యర్థిగా రంగంలోకి దించారు. వైద్యవృత్తిని పక్కనపెట్టి ఆమె పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి దిగింది. పార్టీ తన నెత్తిన పెట్టిన భారాన్ని మోసింది. ఎన్నికల్లో వెన్నుపోట్ల మూలంగా ఓడిపోయింది. ఆర్థికంగానూ నష్టపోయింది. ఎన్నికల తర్వాత గూడూరు పార్టీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాల్లో పూర్తిగా నిమగ్నమై పని చేసింది. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడమే కాకుండా పార్టీ ప్రతినిధిగా వ్యక్తిగతంగా నియోజకవర్గ ప్రజలతో తాను మమేకమవుతున్న తరుణంలో తలవని తలంపుగా వైకాపా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను తెలుగుదేశంలోకి తీసుకున్నారు. ఆమెను నియోజకవర్గ బాధ్యతల నుండి తప్పించారు. ప్రత్యామ్నాయంగా పార్టీలో ఎలాంటి గౌరవప్రదమైన స్థానం కల్పించలేదు. మహిళల నాయకత్వానికి పెద్దపీట వేసే తెలుగు దేశంలో మహిళలకు ఇచ్చే విలువ ఇదేనా అని రాజకీయ విజ్ఞుల ప్రశ్న?

# శుభమస్తు ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం షాపింగ్‌మాల్‌లో ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్ www.subhamasthu.inను జిల్లా ఏఎస్పీ శరత్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నిక, నాణ్యతకు మారుపేరుగా నిలుస్తున్న శుభమస్తు షాపింగ్‌మాల్ సేవలను ఆన్‌లైన్ వ్యవస్థతో విస్తృతం చేయడం హర్షణీయమన్నారు. శుభమస్తు షాపింగమాల్‌కు చెందిన సొంత మగ్గాలపై ప్రత్యేకంగా తయారు చేయించిన దబ్బనంలో దూరే పట్టుచీరను కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా రవి, బయ్యా వాసు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నెల్లూరు వస్త్ర రంగంలో తమ తండ్రి బయ్యా రమణయ్య స్థాపించిన సంస్థ లతో చేనేత రంగాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో వినియోగదారుల సహకా రంతో విస్తృత పరుస్తున్నామన్నారు. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్ ఆధ్వర్యంలో ఆరు గజాల పట్టుచీరను దబ్బనంలో దూరే విధంగా రూపొందించామన్నారు. దూరప్రాంతాలకు చెందిన నెల్లూరీయులు ఆన్‌లైన్ ద్వారా నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

## గోల్డ్ మెడల్స్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస



గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఈ నెల 15న స్టూడెంట్స్ ఒలింపిక్ గేమ్స్‌ను నిర్వహించగా నెల్లూరు సాధన స్కూలు విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు వారిని ప్రశంసించారు. 8వ తరగతి విద్యార్థి సాయికౌషిక్(షార్ట్‌పుట్), 9వ తరగతి విద్యార్థి ఆశ్రిత(డిస్కస్‌త్రో) గోల్డ్‌మెడల్స్ సాధించడంతో వారిని అభినందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బ్యాంకాక్‌లో నిర్వహించే అంతర్జాతీయ క్రీడల్లో వీరు పాల్గొననున్నారు.

## హంస అవార్డు గ్రహీతకు సత్కారం



పౌరాణిక రంగ స్థల సీనియర్ నటులు, ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత పొన్నాల రామసుబ్బారెడ్డికి ఆయన శిష్యబృందం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సత్కారం జరిగింది. దాదాపు 50మంది శిష్యులు నెల్లూరు టౌన్‌హాల్ నుంచి మూలాపేట కోనేటిమిట్ట పొన్నాల నివాసానికి ఊరేగింపుగా వెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తబలా కళాకారుడు మోహన్ జనార్ధన్ ఆధ్వర్యంలో కళాకారులంతా రామసుబ్బారెడ్డిని సత్కరించారు. అనంతరం సంగీత కచేరి, పౌరాణిక, సాంఘిక నాటక ఘట్టాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మోహన్ జనార్ధన్ మాట్లాడుతూ దాదాపు ఆరు దశాబ్దాలుగా నాటక రంగానికి అంకితమై, ఆ రంగంలో ఎందరికో చేయూతనిచ్చిన గురువును సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పౌరాణిక కళాకారుడు వల్లకవి వేంకటసుబ్బారావు, మేకప్ ఆర్టిస్టు లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వాత్సల్య విద్యార్థులు



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా కాంపిటిషన్ ఈ నెల 20వ తేదీన నెల్లూరు కస్తూరిదేవి బాలికల హైస్కూల్లో జరిగింది. ఈ పోటీల్లో జనహిత–వాత్సల్య సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలుకు చెందిన 10 మంది బాలబాలికలు అండర్ 17, అండర్ 14, అండర్ 11 లెవల్‌లో గెలుపొందారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఈ నెల 21వ తేదీ వాత్సల్య స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనహిత – వాత్సల్య సంఘటన కార్యదర్శి, హైస్కూల్ కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు, యోగా గురువు యం.నరశింహశాస్త్రి, ప్రధానోపాధ్యాయుడు యం.మధుసూదన్‌రెడ్డి, టివియస్ దుర్గాప్రసాద్, గుత్తికొండ ఆంజనేయులు పిల్లలను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యోగా గురువు ముప్పిరాల నరశింహశాస్త్రిని విద్యార్థులు సన్మానించారు.

## మిగిలిన ఆశ నవంబర్!

అక్టోబర్ నెల కూడా అయిపోయింది. నెల్లూరుజిల్లాను వదిలి ఎండాకాలం ఇంకా పోలేదు. ఇంకా 36, 38డిగ్రీల ఎండ కాస్తోంది. భూగర్భ జలాలు అడుగంటి పోయి తాగు, సాగునీట సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర మంతా వర్షాలు పడినా నెల్లూరుజిల్లాలో చినుకు జాడ లేదు. మన జిల్లాకు నవంబర్ నెల ఒక్కటే ఆశా జనకం. ఈశాన్య ఋతు పవనాల ప్రభావం వల్ల జిల్లాలో వర్షాలు పడుతుంటాయి. ఈ నవంబర్ నెలలో వర్షాలు పడలేదంటే... ఇక అంతే సంగతులు!

## భగవద్రామానుజుల ప్రచార రథం



భగవద్రామానుజుల వారి సహస్రాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరంగం నుంచి బయల్దేరిన ప్రచారరథం ఆదివారం రాత్రి నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంకు చేరుకుంది. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, వేదాంత దేశికర్ దేవస్థానానికి చెందిన అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

## చైనా టపాసులపై ధర్నా

దీపావళి వేడుకలో చైనా టపాసులను బహిష్కరించాలని కోరుతూ సోమవారం నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి మెంటా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలోనూ, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం విషయంలోనూ భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న చైనా ఉత్పత్తులను మనం బహిష్కరించాలన్నారు. చైనా టపాసుల్లో ప్రమాదకరమైన రసాయనాలు వాడుతున్నారని, వాటివల్ల మన ఆరోగ్యం చెడిపోతుందన్నారు. చైనా వస్తువులను కొనడం ఆపేస్తే... చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిడతల రమేష్, ఎవిఆర్ మోహన్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాసులు, ఎన్.రత్నం, బాలాజీ, మిద్దె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

## ఎన్నాళ్లకెన్నాళ్లకు...

నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఈరోజు(28వ తేదీ) మొదలై వుంటుంది. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని దాదాపు ఏడాది తర్వాత నిర్వహిస్తున్నారు. కౌన్సిల్ సమావేశం పెట్టడంటూ ప్రతిపక్ష వైకాపా కార్పొరేటర్లు ఎప్పటి నుండో అరచి గోలపెడుతున్నారు. నగరంలో ప్రజా సమస్యలను ప్రస్థావించి చర్చించే వేదిక కౌన్సిల్ సమావేశం. మేయర్ అజీజ్ నిరంకుశ వైఖరి మూలంగా ఆ కౌన్సిల్ సమావేశాలకు దిక్కు లేకుండా పోయింది. ఇప్పుడు కూడా ఏదో బలవంతం మీద కౌన్సిల్ సమావేశం పెట్టినట్లుంది. అజెండాలో అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలకంటే కూడా సొంత ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలనే ఎక్కువుగా పొందు పరిచారని తెలుస్తోంది.

## ఖర్చు పేరుతో దోపిడీపై విజిలెన్స్‌కు ఫిర్యాదు



నెల్లూరులో ఇటీవల జరిగిన రొట్టెల పండుగ ఖర్చుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్‌సిపి నాయకుడు, నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. ఈ నెల 22న కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వైఎస్సార్‌సిపి నాయకులు ముక్కాల, వైకాపా ఫ్లోర్‌లీడర్ రూప్ కుమార్‌యాదవ్‌లు మాట్లాడుతూ పండుగ పేరుతో దోచేశారని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశాల్లోనూ అక్రమాలకు యత్నిస్తున్నారని విమర్శించారు. నగరపాలక సంస్థ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకుగానీ, సంస్థలకు గానీ, ధార్మికసంస్థలకుగానీ ఇవ్వకూడదని 2002లోనే సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందన్నారు. అయితే, నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్ వద్ద వున్న స్థలాన్ని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు సంబంధించిన స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఎందుకు కేటాయించారని వారు ప్రశ్నించారు. ఈ విషయం కేంద్రమంత్రికి తెలియదా అని వారు ప్రశ్నించారు. రొట్టెల పండుగలో భారీ దోపిడీ జరిగిందని, దీనిని వైఎస్సార్‌సిపి సహించదని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఎం.డి. ఖలీల్‌అహ్మద్, గోగుల నాగరాజు, నాయకులు వేలూరు మహేష్, వందవాసి రంగ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ వక్రబుద్ధి

నగర శివారు ప్రాంతాల్లో ప్రేమజంటల ఫోటోలను సెల్‌ఫోన్‌లో బంధిస్తూ, బ్లాక్‌మెయిల్ చేస్తూ వారి ధన, మానాలతో ఆడుకుంటున్న బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పాలెం గోపీని సస్పెండ్ చేసి, అరెస్ట్ చేశారు. అతని మీద వచ్చిన ఆరోపణలపై ఎస్పీ విశాల్‌గున్నీ విచారించి ఈ నిర్ణయం తీసుకున్నారు. పాలెం గోపి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నంత సేపు ఒక అవతారం, అక్కడ నుండి బయటకొచ్చాక మరో అవతారం ఎత్తుతాడు. డ్యూటీ ముగించి వచ్చాక నగర శివారు ప్రాంతాల్లోకి పోతాడు. ప్రేమజంటలు కనిపిస్తే చాలు... ముందుగా సెల్‌లో ఫోటోలు తీస్తాడు. వాటిని చూపించి వారిని బెదిరిస్తాడు. డబ్బులు గుంజుతాడు. అమ్మాయిలను లోబరుచుకునేవాడు. ఇటీవల ఓ మెడికో జంట ఇలాగే ఇతగాడి సెల్‌ఫోన్‌కు బంది అయ్యింది. ఫోటోలు వున్నాయని బెదిరించి వారి నుండి డబ్బులు గుంజాడు. అవి కూడా చాలక మెడికో విద్యార్థినిని ఫోన్‌లో అసభ్యంగా వేధించసాగాడు. ఇతడి హింసను తట్టుకోలేని ఆ అమ్మాయి ఇతగాడి వాయిస్‌ను సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసి జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీకి వినిపించింది. ఆయన వెంటనే చర్యకు ఆదేశించారు. ఇక్కడితో ఇతడి పాపం పండినట్లయ్యింది.

## 'నేస్తం'కు రక్తదాన అవార్డ్



ఈ నెల 22న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు నందు జరిగిన ఉత్తమ రక్తదాన వాలంటీర్ల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో 'నేస్తం ఫౌండేషన్'కు 2016 సంవత్సరానికిగాను ప్రథమ స్థానం దక్కింది. రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ సుబ్బారావు చేతులమీదుగా నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్ అవార్డు అందుకున్నారు.




## నెల్లూరుజిల్లా ప్రగతికి కేంద్రం...

# కృష్ణపట్నం నౌకాశ్రయం

కృష్ణపట్నం పోర్టుతో జిల్లా పారిశ్రామిక అభివృద్ధి శరవేగంగా పుంజుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారామ్ తెలిపారు. 22వ తేదీ కృష్ణపట్నం పోర్టును ఆయన సందర్శించారు. ముందుగా కృష్ణపట్నం పోర్టు సెక్యూరిటీ అకాడమీలో సెక్యూరిటి గౌరవ వందనం స్వీకరించారు. కె.ఎస్.ఎస్.పి.యల్ ఆవరణంలో మొక్కలు నాటారు. పోర్టు సివిఆర్ పాఠశాల విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం క్యాప్స్ ద్వారా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఆయన పరిశీలించి క్యాప్స్ సేవలను అభినందించారు. కృష్ణపట్నం పోర్టు పరిపాలనా భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోర్టు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోర్టు యం.డి శశిధర్, డైరెక్టర్ & సి.ఇ.ఓ అనిల్ యండ్లూరిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోర్టులో నిర్వహించే అన్ని కార్యక్రమాలను నిశితంగా ఒకే ప్రాంతం నుండి పరిశీలించే విధంగా కంట్రోల్‌రూమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కృష్ణపట్నం పోర్టు అభివృద్ధితో రాబోయే రోజుల్లో నెల్లూరుజిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో అగ్రగామిగా రూపుదిద్దుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. అలాగే, కృష్ణపట్నం పోర్టు సి.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అభినందించారు.

ఈ కార్యక్రమంలో సి.ఒ.ఒ చక్రవర్తి, సుబ్బారావు, పి.ఆర్ హెడ్ వేణుగోపాల్, జి.ఆర్.ప్రసాద్, మృదుల, భరత్‌రెడ్డి, ఎస్పీ విశాల్‌గున్నీ, డిఎస్పీ, సిఐ, ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

## ఏసిబి వలకు పడుతున్న...

# ట్రాన్స్‌పోర్ట్ తిమింగలాలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఏసిబి అధికారులు

**ఈమధ్య అవినీతి నిరోధక శాఖ వాళ్లు రవాణాశాఖలోని అవినీతిని తమ టార్గెట్‌గా చేసుకున్నట్లుగా వున్నారు. ఆ శాఖకు సంబంధించిన పెద్దపెద్ద తమింగలాలనే పడుతున్నారు. డిటిసి మోహన్, ఒంగోలు ఆర్‌టివో రాంప్రసాద్‌ల అవినీతి లీలలను జనం ఇంకా మరువకముందే నెల్లూరు ఆర్టీఓ పూర్ణచంద్రరావు అవినీతి భాగోతాన్ని బయటపెట్టారు. ఆదాయానికి మించి కోట్లలో వున్న ఆయన ఆస్తులను స్క్రీన్ మీద చూపించారు.**

ఈ నెల 24వ తేదీన నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, వినుకొండ, విజయవాడ, చీరాలలో పూర్ణచంద్రరావుకు సంబంధించిన ఆస్తులపై ఏసిబి అధికారులు ఒకే సమయంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వివిధ ప్రాంతాల్లో ఆయనకు తొమ్మిది ఫ్లాట్లు, వినుకొండలో ఒక ఇల్లు, చీరాలలో ఓ బట్టలకొట్టు, పిడుగురాళ్లలో పప్పులమిల్లు వున్నట్లు గుర్తించారు. ఇక గుంటూరులోని ఇంట్లో జరిపిన సోదాలలో ఒకటిన్నర కిలో బంగారం, 60కిలోల వెండి సామాన్లు, మూడున్నర లక్షల డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ వెండి సామాన్లు చూసి ఏసిబి వాళ్లే కళ్లు తేలేసారు. ఇక బ్యాంక్‌లో మరో 20లక్షల నగదు వున్నట్లు గుర్తించారు. అలాగే నెల్లూరు శ్రీహరినగర్‌లో వున్న ఆర్టీఓ ఇంటిని ఏసిబి అధికారులు సీజ్ చేశారు. ఈ దాడుల్లో మొత్తం 40కోట్ల ఆస్తులను గుర్తించారు. అలాగే ఆర్టీఓకు బినామీగా వ్యవహరిస్తున్న ఆర్టీఏ ఏజెంట్ అబ్దుల్ రహీంను కూడా అరెస్ట్ చేశారు. పూర్ణచంద్రరావును అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టారు.

### అందరూ నెల్లూరు అనుబంధీకులే!

ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసిబికి దొరికినవాళ్లంతా నెల్లూరుతో అనుబంధమున్నవాళ్లే! ఇక్కడ ఎంతో కొంత కాలం పనిచేసిన వాళ్లే ఉండడం గమనార్హం. మోహన్, జనార్ధన్‌శెట్టి, రాంప్రసాద్, సుధాకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి... వీళ్లందరూ ఏసిబికి చిక్కిన వాళ్లే! నెల్లూరులో వివిధ హోదాలలో గతంలో పనిచేసినవాళ్లే! రవాణాశాఖ పరంగా నెల్లూరుజిల్లాలో పోస్ట్ అంటే చాలా కీలకం. ఇక్కడ ఆదాయం బాగానే వుంటుంది. ఇక్కడ కలిసొచ్చే అంశం ఈ జిల్లాకు తమిళనాడు సరిహద్దు కావడం. రవాణాశాఖకు బి.వి.పాలెం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు పెద్ద ఆదాయవనరు. ఇక్కడ పోస్ట్ పడిందంటే చేతిలో కాసుల గలగలే! అదీగాక నెల్లూరు నుండి నిత్యం జాక్‌పాట్ లారీలు, ఇసుక లారీలు నుండి అధికమొత్తంలో ఆదాయముంటుంది. వివిధ మార్గాల్లో ఆదాయం బాగా వుండబట్టే నెల్లూరు రవాణాశాఖలో పోస్టింగ్ కోసం పెద్దఎత్తున పైరవీలు జరుగుతుంటాయి.

## కుమ్ములాటల కేంద్రంగా...

# 'సబ్‌ప్లాన్' కాంట్రాక్టులు

**ఎక్కడన్నా శవం ఉందంటే రాబందులు వచ్చి వాలినట్లు, కాంట్రాక్ట్ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందంటే చాలు... రాజకీయ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి వాలిపోతున్నారు. లక్ష రూపాయల పని నుండి కోట్ల రూపాయల పని దాకా దేనినీ వదలడం లేదు. వాటాలేసుకుని పంచేసుకుంటున్నారు.**

నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించి మంజూరైన 42కోట్ల రూపాయల ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల పనుల్లోనూ ఈ రాజీ మంత్రమే నడిచింది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని మురికి వాడల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం 42కోట్లు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసింది. కార్పొరేషన్ పాలకులు నిధుల కోసం ఆవురావురుమంటున్నారు. నగరంలో మంచినీళ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు హడ్కో నుండి 1100 కోట్లు మంజూరయ్యాయన్నమాటే గాని, ఈ పనుల వల్ల మన పాలకులకు వ్యక్తిగతంగా పైసా ఆదాయం లేకుండా పోయింది. సొంతంగా అభివృద్ధి పనులు చేపట్టి నాలుగు రాళ్లు వెనకేసుకోవడానికి కార్పొరేషన్‌లో నిధులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ 42కోట్ల పనులు పాలకులకు పండుగే అయ్యాయి. ఈ పనులను నామినేషన్ క్రింద దక్కించుకోవడానికి పాలకులు నానా తంటాలు పడ్డారు. ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు దీనిపై పెద్ద రద్ధాంతం చేసారు. సబ్‌ప్లాన్ నిధుల పనులను వెంటనే మొదలుపెట్టాలంటూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళనలకు దిగారు.

సబ్‌ప్లాన్ పనులు చేపట్టడాన్ని ఇక నాన్చలేక ఇటీవలే టెండర్లు పిలిచారు. ఈ పనుల విషయంలో కార్పొరేషన్‌లో ప్రధాన వర్గాలైన మేయర్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి వర్గీయుల మధ్య పనుల పంపకాలు జరిగాయి. ఎనిమిది ప్యాకేజీలుగా విభజించిన సబ్‌ప్లాన్ పనులు మూడు అజీజ్, మూడు ఆదాల, రెండు ముంగమూరు వర్గీయులు చేసుకునేలా ఒప్పందం కుదిరింది. అయితే టెండర్ల విషయంలో ఆదాల వర్గీయులు స్పీడై మేయర్ వర్గీయులు చేసిన పనులకు కూడా టెండర్లు వేసి వాటిని కూడా దక్కించుకున్నారు. దీంతో మేయర్ వర్గం ఖంగుతింది. రాజకీయాల్లో అదురుదెబ్బలు ఏ విధంగా వుంటాయో అజీజ్ చవిచూసారు. పారదర్శకంగా జరగాల్సిన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పనులను ఈ విధంగా కుమ్మక్కై పంచుకోవడం పట్ల విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

# పర్యాటక ప్రగతికి చొరవ



జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాల పనులను పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా మైపాడుబీచ్‌కి సంబంధించి నిర్దేశించిన పనులను కేటగిరివారీగా అప్రోచ్ రోడ్డులు, కాటేజ్ అభివృద్ధి పనులు, తదితర మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తడ నుండి భీమునివారి పాళెం వరకు రోడ్డు రిపేరు పనులు, కావలి క్రాస్‌రోడ్డు నుండి తుమ్మలపెంట వరకు గల రోడ్లు, టి.పి.గూడూరు నుండి కొత్తకోడూరు బీచ్ వరకు రోడ్డు, నర్రవాడ క్రాస్‌రోడ్డు నుండి ఉదయగిరి వరకు గల రోడ్డు మరమ్మత్తు పనులను, అటకానితిప్ప, రామతీర్థం ప్రాంతాలవద్ద పర్యాటక అభివృద్ధి పనులు మరియు మైపాడు బీచ్ వద్ద చెత్తా, చెదారం లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాల పనులు సక్రమంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరకం వద్ద రిసార్ట్ ఏర్పాటుకు, తుమ్మలపెంట వద్ద బీచ్ రిసార్ట్, కండలేరు సమీపంలో తోకపాళెం రిసార్ట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లిపాడు వద్ద పినాకిని గాంధీ ఆశ్రమం అభివృద్ధి, జువ్వలదిన్నె వద్ద పొట్టి శ్రీరాములు మెమోరియల్ సెంటర్ ఏర్పాట్లకు సంబంధించిన అభివృద్ధి పనులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జనవరిలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్ గత అనుభవాలను, నిర్వహించిన కార్యక్రమాల పనులను దృష్టిలో పెట్టుకుని అత్యంత వైభవంగా జరిగేలా సంబంధిత అధికారులతో కమిటి వేసి తగిన ప్రణాళికలు రూపొందించి, విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రమౌళి, పంచాయితీరాజ్ ఎస్ఇ బుగ్గయ్య, జిల్లా టూరిజం అధికారి నాగ భూషణం, ఫారెస్ట్ రేంజ్ అధికారులు వెంకట రత్నం, కుమార రాజా, నగర కార్పొరేషన్ ఎస్.ఇ జె.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఈశ్వరయ్య, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో నాల్గవ డ్రా

నెల్లూరులోని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఆదివారం నాల్గవ వారం లక్కీడ్రా జరిగింది. విజయదశమి పర్వదినం సందర్భంగా షాపింగ్‌మాల్‌లో వస్త్రాలు, బంగారం కొనుగోలు చేసిన వారికి లక్కీడ్రా ద్వారా ప్రతి ఆదివారం 10 బహుమతులు అందిస్తున్నారు. అందులో భాగంగా నాల్గవ వారం విజేతలను ఎంపిక చేసేందుకు వాణిజ్య పన్నుల శాఖ ఉపకమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి డ్రా తీశారు. లక్కీడ్రా ద్వారా కుక్కర్ల విజేతలుగా శ్వేత, ఏడుకొండలు, పూజితలు, మూడు మిక్సీలకు ఎస్‌కె రఫి, నాగబాబు, ఎస్‌కె తషార్, రెండు గ్రైండర్లకు ఏ.కృష్ణ, ఎస్.కె.నబీనా, రిఫ్రిజిరేటర్ విజేతగా వై.మధుసూదనరెడ్డి ఎంపికయ్యారు. టివియస్ స్కూటీ విజేతగా దిలీప్‌కుమార్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతరం గత వారం విజేతలకు కృష్ణమోహన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ ఆర్ట్స్ అధినేత మోపూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.




అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# పరిశుభ్రతతోనే దోమల నివారణ

## - ఛైర్‌పర్సన్ దేవసేన


'దోమలపై దండయాత్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య, ఛైర్‌పర్సన్ పొనక దేవసేన, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని గూడూరు పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 22వ తేదీ దోమలపై దండయాత్ర కార్యక్రమ ర్యాలీని ఇన్‌ఛార్జ ఆర్డీవో వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ ఇంటింటికి వెళ్లి దోమలపై దండయాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పరంజ్యోతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఈ నెల 23వ తేదీ మాజీ ఏజీపీ, ప్రముఖ సీనియర్ న్యాయవాది యరగుడిపాటి రామారావు 90వ జన్మదినోత్సవ వేడుకలు గూడూరు హనుమంతరావు నగర్‌లోని వారి నివాసంలో వారి కుమారుడు సీనియర్ న్యాయవాది యరగుడిపాటి చలపతిరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణ ప్రముఖులు, ప్రముఖ న్యాయవాదులు పాల్గొన్నారు.

# క్యాంపస్ సెలక్షన్స్‌లో 12మంది ఆదిశంకర విద్యార్థులు

ఈ నెల 22వ తేదీన గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో బెంగుళూరుకు చెందిన టివిఎస్‌హెచ్‌టిఆర్‌ఐ టెక్నాలజీస్ కంపెనీ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. ఇందులో భాగంగా ఈసీఈ, సివిల్, ఇఇఇ విభాగాల విద్యార్థులకు వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాత పరీక్ష, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన పరీక్షల్లో 12మంది విద్యార్థులు ప్రతిభ చూపి, ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ కృష్ణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## దీపావళికి అప్రమత్తంగా ఉండండి

### - డిఎస్పీ శ్రీనివాస్



సోమవారం డివిజన్‌లోని పోలీసు అధికారులతో డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తన కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న దీపావళి పండుగను పురస్కరించుకుని బాణాసంచా, టపాసులు అక్రమంగా నిల్వచేసే ప్రాంతాలపై విస్తృతంగా దాడులు చేయాలని అన్నారు. ప్రధానంగా నేరాల సంఖ్య క్రమేపీ తగ్గేలా చర్యలు తీసుకోవాలని, దీపావళికి ఎక్కడా ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకొనేలా వ్యాపారులకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసరావు, రత్నయ్య, విజయకృష్ణ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## జేవీవీ, ఇన్నర్‌వీల్ క్లబ్ దోమతెరలు


దోమతెరలను పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేన, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు స్నేహలతారెడ్డి

గూడూరు పట్టణంలోని ఎస్టీ, వసతి గృహంలో జనవిజ్ఞాన వేదిక, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పిఎస్‌ఆర్ ట్రస్టు సహకారంతో ఆదివారం దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చదువుకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో, ఆరోగ్యం పట్ల కూడా అంతే శ్రద్ధ వహించాలని అన్నారు. వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని, ఈ క్రమంలోనే వసతి గృహానికి ప్రతిరోజూ శుద్ధి జలాలను 15క్యాన్లు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంకా జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై. స్నేహలతారెడ్డి మాట్లాడారు.

## ముత్యాలయ్యకు పనబాక దంపతుల సంతాపం



గూడూరు మండలం పోటుపాళెం గ్రామానికి చెందిన ఎన్‌డిసిసి బ్యాంకు డైరెక్టర్, గూడూరు 24 సొసైటీ డైరెక్టర్, కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకుడు గ్రిద్దలూరు ముత్యాలయ్య (36) ఆదివారం గుండె పోటుతో మృతి చెందడంతో పలువురు నివాళులర్పించారు. వీరిలో కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎన్‌డిసిసి బ్యాంకు వైస్‌ప్రెసిడెంట్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, వీరిబోయిన గోపాలకృష్ణయాదవ్, బాబురెడ్డి ఉన్నారు.

# రిజిస్ట్రేషన్‌లోనూ జిఎస్‌టిది ప్రత్యేకతే!

**జిఎస్‌టిపై పరిశీలన-3**


చిన్ని శ్రావణ్‌కుమార్
చార్టర్డ్ అకౌంటెంట్
సెల్: 9492882878

మన దేశంలో పన్నుకు సంబంధించిన చట్టాల్లో రిజిస్ట్రేషన్ నెంబరు పొందడం చాలా అవసరం. ఇది ఇన్‌కంటాక్స్ అయితే పాన్ నెంబరు, సిఎస్‌టి అయితే టిన్ నెంబరు మొదలైనవి. ఏ నెంబరు పొందాలన్నా ఒక దరఖాస్తు చేసుకోవాల్సివుంది. అయితే, ఇన్‌కంటాక్స్ మినహా ఏ నెంబరు కావాలన్నా రిజిస్ట్రేషన్ ద్వారానే పొందగలం. కొత్తగా వచ్చిన విధానాలకు పాన్ నెంబరును ఆధారంగా చేయడం జరిగింది. వస్తు సేవా పన్నుల చట్టం అందుకు అతీతమేమీ కాక పోవడం గమనార్హం.

ఒక చట్టానికి ఒక రిజిస్ట్రేషన్ సహజం. కానీ, జిఎస్‌టి ప్రత్యేకత ఒకే చట్టంలో రెండు రిజిస్ట్రేషన్‌లు కలిగివుండడం.

ఎవరెవరు జిఎస్‌టి చట్టంలో రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సి వుంటుందో షెడ్యూలు–3 జిఎస్‌టి చట్టంలో పొందుపరచి వుంటుంది. అయితే, జిఎస్‌టిలో రాష్ట్రానుగుణంగా రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సివస్తుంది. అంటే, సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి ఇంకా ఐజిఎస్‌టి లాంటివి.

కేంద్రీకృత రిజిస్ట్రేషన్ విధానానికి వస్తు సేవాపన్నులో చరమగీతం పాడడం జరిగింది. ఒక రాష్ట్రానికి ఒకే రిజిస్ట్రేషన్ మాత్రమే అయినప్పటికీ, వివిధ రాష్ట్రాల్లో వివిధ బ్రాంచ్‌లు కనుక వుంటే, వాటికి చేసే వివిధ వస్తు సరఫరాలకు మరొక రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సివస్తుంది.

ఒకే కంపెనీకి ఒకటికంటే ఎక్కువ రకాల వ్యాపారాలు ఒకే రాష్ట్రంలో వుంటే ఒక్కో వ్యాపారానికి ప్రత్యేకించి రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సివుంటుంది. అయితే, ఒకే రాష్ట్రంలో జరిగే అన్ని రకాల వ్యాపారాలకు ఒకే రిజిస్ట్రేషన్‌తో కూడా సరిపెట్టుకోవచ్చు.

**ఉదా:** ఫ్యూచర్ గ్రూప్ వారికి రెండు వ్యాపార విభాగాలున్నాయి అనుకుందాం.

**1. బిగ్‌బజార్ :** ప్రతిరాష్ట్రానికి ఒకటికంటే ఎక్కువ షోరూమ్స్ వున్నాయి.

**2. ఫ్యూచర్ ఇన్సురెన్స్ :** రెండు ముంబైలో, ఒకటి చెన్నైలో.

ఇప్పుడు పైన తెలిపిన ఉదాహరణల్లో రిజిస్ట్రేషన్లు ఎలా పొందాలో పరిశీలిద్దాం.

**1. బిగ్‌బజార్ :** ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రకారం అన్ని రాష్ట్రాల్లో తీసుకొనవలసివుంటుంది.

**2. ఫ్యూచర్ ఇన్సురెన్స్ :** రెండు రిజిస్ట్రేషన్‌లు ఒకటి ముంబైలో, మరొకటి చెన్నైలో కలిగివుండాల్సి వుంటుంది.

సరఫరాదారుడు సొంతంగా కానీ, లేక అతడు చేసే మొత్తం అమ్మకాన్ని పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ తీసుకొనాల్సి వుంటుంది. ఒక వ్యాపార సంవత్సరంలో నిర్ధారించిన అమ్మకం కంటే ఎక్కువ వ్యాపారం చేసివుంటే ఆ వ్యక్తి లేక సంస్థ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ తీసుకొనవలసివుంటుంది. మొత్తం అమ్మకాలు (అగ్రిగేట్) అనగా, ఒక వ్యక్తి లేక సంస్థ చేసే అమ్మకాలను పరిగణనలోకి తీసుకోబడుతాయి.

- అవి పన్ను మరియు పన్ను లేని సరఫరాలు
- పన్ను మినహాయించిన సరఫరాలు మరియు
- ఎగుమతులు లేక దిగుమతులు సేవలైనా, లేక వస్తువులైనా

మొత్తం అమ్మకాలంటే (అగ్రిగేట్) భారత దేశం మొత్తమ్మీద లెక్కించబడుతుంది.

**ఉదా :** ఆంధ్రప్రదేశ్‌లో ఒక వ్యక్తి 'పాన్' (పిఎఎన్) కలిగి వుండి, అతడు తెలంగాణ, ముంబైలలో వ్యాపారం చేస్తుంటే, ఈ మూడు ప్రదేశాల్లోని అమ్మకాలను మొత్తం అమ్మకాలు (అగ్రిగేట్)గా తీసుకొనవలసివుంటుంది.

అయితే, మొత్తం అమ్మకాలలో ఏ సరఫరాకైనా 'రివర్స్ చార్జ్' ఉన్నట్లయితే ఆ అమ్మకాలు తీసుకొనబడవు.

అయితే, షెడ్యూలు–3 ప్రకారం మొత్తం (అగ్రిగేట్) అమ్మకంతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ తీసుకొనవలసివుంటుంది.

ప్రధానవ్యక్తి (ప్రిన్సిపల్) ఆదేశాలతో వస్తు సేవలు సరఫరా చేసే జాబ్‌వర్క్‌కి అతడు (జాబ్‌వర్కర్) ప్రధాన వ్యక్తి కోసం చేసే ఏ అమ్మకాన్ని అతడు సొంతంగా చేసే అమ్మకాల్లోకి తీసుకొనబడదు.

ఏ వ్యక్తి అయినా పన్ను పరిధిలోకి రాని వస్తు సేవలను సరఫరా చేస్తుంటే అతని మొత్తం అమ్మకం విలువ నిర్దిష్ట అమ్మకాన్ని దాటినా రిజిస్ట్రేషన్ తీసుకొనవలసిన అవసరం లేదు. అతడికి రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు ఇవ్వడం జరుగుతుంది.

కౌన్సిల్ సూచనల మేరకు వస్తు సేవాపన్నుల చట్టంలో సెక్షన్ 9 (2) ప్రకారం వివిధ రాష్ట్రాల్లోని వ్యక్తులకు రిజిస్ట్రేషన్ మినహాయించే అధికారం ఇవ్వడం జరిగింది.

ఈ క్రింది వ్యక్తులు లేదా సంస్థలు మొత్తం అమ్మకం (అగ్రిగేట్ టర్నోవర్)తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ పొందవలసి వుంటుంది.

1) ఒక రాష్ట్రంలో ఉండే వ్యక్తి మరో రాష్ట్రానికి సరఫరా జరిపితే

2) సాధారణంగా పన్ను కట్టే వ్యక్తి క్యాజువల్ టాక్సబుల్ పర్సన్

**ఉదా :** టపాసులు అమ్మేవారు రెండు మూడు నెలలకంటే వ్యాపారం చేయరు. వీరు ఇటువంటి రిజిట్రేషన్ పొందవచ్చు. సీజనల్ వ్యాపారులకు ఇది ఒక వరం.

3) రివర్స్ ఛార్జ్ క్రింద పన్ను కట్టవలసిన వ్యక్తి.

4) రాష్ట్రేతర నివాసం ఉంటూ పన్ను కట్టే వ్యక్తి.

5) సెక్షన్ 37 ప్రకారం పన్ను మినహాయించే వ్యక్తి.

6) ప్రతినిధిగానైనా లేక వేరేవిధంగానైనా ఇతర వ్యక్తుల కోసం వస్తు, సేవలను సరఫరా చేసే వ్యక్తి.

7) ఇన్‌పుట్ సేవలను పంపిణీ చేసే వ్యక్తి.

మొదలైనవారే కాక మరికొంతమంది వ్యక్తులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ తీసుకొనవలసి ఉంటుంది.

జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 142(1) ప్రకారం పాత చట్టాలలో రిజిస్ట్రేషన్ ఉన్న వారికి తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఇవ్వడం జరుగుతుంది. ఇది కౌన్సిల్ నిర్ధారించిన కాలం వరకు చెల్లుబాటు అవుతుంది. సెక్షన్ 142(3) ప్రకారం తాత్కాలిక రిజిస్ట్రేషన్ కలిగిన వ్యక్తి జి.ఎస్.టి శాఖ వారు అడిగిన సమాచారం ఇచ్చి అన్ని సరిచూసుకొన్న ఎడల సంపూర్ణ రిజిస్ట్రేషన్ ఇవ్వడం జరుగుతుంది.

# చైనా పతనానికి వివేకా వ్యూహం

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. ప్రధాని నరేంద్రమోడీ తన ఛాంబర్‌లో కేంద్రమంత్రులు మనోహర్ పారికర్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, యం.వెంకయ్యనాయుడు, సుష్మాస్వరాజ్, సురేష్ ప్రభులతో సమావేశమై ఉన్నారు. మోడీ ముఖంలో ఆందోళన కనిపిస్తోంది. అర్జంట్‌గా రమ్మన్నారు, విషయం ఏంటని అరుణ్‌జైట్లీ అడిగాడు. మోడీ అందుకు జవాబిస్తూ... పాకిస్థాన్ విషయంలో చైనా వైఖరి పూరందరిదీ ఒక దారయితే ఉలిపి కట్టెది ఒక దారన్నట్లుగా వుంది. ఉగ్రవాదాన్ని అంతమొందించాలంటూ ప్రపంచమంతా పాకిస్థాన్‌ను ఆదేశిస్తున్నా, చైనా మాత్రం దానిని వ్యతిరేకిస్తోంది. మనకు పాకిస్థాన్ కంటే కూడా చైనా ప్రమాదకరంగా మారుతోంది. మన శత్రుదేశమని తెలిసినా కూడా చైనా ఆర్థికవృద్ధికి భారత మార్కెట్ ప్రత్యక్షంగా ఉపయోగపడుతోంది. చైనా వస్తువులను కొనద్దంటూ ఇటీవల సోషల్ మీడియాలో మన దేశ భక్తులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చైనా వస్తువులను నిషేధిస్తూ ప్రభుత్వం నేరుగా నిర్ణయం తీసుకోకూడదు... సోషల్ మీడియాలో ఎంత ప్రచారం చేసినా ఆ దేశ వస్తువులు చాలా సలీసుగా దొరుకుతుండడంతో పూర్తి స్థాయిలో నియంత్రించలేక పోతున్నాం. ఇప్పుడు దీపావళి టపాసులు కూడా దేశంలోకి దిగుమతి అవుతున్నాయి. మన డబ్బు చైనాకు వెళుతోంది. దీనిని కంట్రోల్ చేసే మార్గమేదన్నా ఉంటే చెప్పండని అడిగాడు. వెంటనే వెంకయ్యనాయుడు లేచి... చైనాను ఆర్థికంగా దివాళా తీయాలి. అలా చేస్తేనే వాళ్ల నుండి పాకిస్థాన్‌కు సాయం ఆగిపోతుంది. మన దేశాన్ని ఈరోజు అడుక్కునే స్థితిలోకి తెచ్చింది కాంగ్రెస్ నాయకులే! కాబట్టి కనీసం ఇప్పుడన్నా మీ దేశ భక్తిని నిరూపించుకోమని చెప్పడానికి కాంగ్రెస్ నాయకులందరినీ చైనాలోకి పంపిద్దాం. వీరిలో కుంభకోణాలు చేయడంలో ఎక్స్‌పర్ట్స్ కూడా ఉంటారు. వీళ్లు అక్కడి రాజకీయాల్లో చొరబడి పరిపాలనను అస్తవ్యస్తం చేస్తారు. దేశాన్ని అవినీతి కూపంగా మారుస్తారు. ఆ దేశాన్ని అభివృద్ధిలో వందేళ్లు వెనక్కు తీసుకుపోతారు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకులతో మాట్లాడితే బాగుంటుందని సలహా ఇచ్చాడు. అప్పుడు రాజ్‌నాథ్‌సింగ్ లేచి... కాంగ్రెస్ నాయకులను అడగడం, వారిని బ్రతిమలాడడం దండగ. అదీగాక ఎవరు పడితే వాళ్లు జొరబడి రావడానికి అదేం ఇండియా కాదు, చైనా! అక్రమంగా చొరబడితే కాల్చి పడేస్తారు. అంతటి అవకాశమే ఉంటే కాంగ్రెస్ నాయకుల దాకా ఎందుకు, మన ఏపి సీఎం చంద్రబాబును పంపిస్తే చాలు. ఆయన పేరును చంగ్‌వాంగ్‌గా మార్చి పంపించి ఆ దేశాధినేతను చేస్తే చాలు. ఉన్న నగరాలన్నింటిని కూలగొట్టి కొత్తవి కట్టిస్తాడు. ఇక వాళ్లకు అలవాటు లేని పుష్కరాలు గట్రా నిర్వహించి ఆ దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి చివరకు వారిని అడుక్కునేట్లు చేయగలడు. చంద్రబాబు కెపాసిటీపై ఆ నమ్మకం వుంది. కాని అలా చేయడానికి ఆ దేశంలో సాధ్యపడదే అన్నాడు. అప్పుడు వెంకయ్యనాయుడు... ముల్లును ముల్లుతోనే తీయాలి. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి. చైనా కన్నింగ్ చేష్టలను, కన్నింగ్ ఆలోచనలతోనే తిప్పికొట్టాలి. దీని కోసం నేను మా నెల్లూరు నుండి ఒక లీడర్‌ను పిలిపిస్తాను అంటూ సెల్ తీసి ఫోన్ చేసాడు.

కరెక్ట్‌గా నాలుగు గంటల తర్వాత స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(65) చేతిలో సిగరెట్‌ను చుట్టుకుంటూ వారి ముందు తేలాడు. వెంకయ్యనాయుడు సమస్యను చెప్పాడు. అంతా విన్న వివేకా... ఇది యుద్ధంతోనో లేక వారి వస్తువులను నిషేధిస్తేనో తీరే సమస్య కాదు. మనం కూడా వారి దారిలోనే వెళ్లాలి. వాడి వంటికి నొప్పి తెలియకుండానే వాడి పంటిని పీకాలి. వాడు కల తెలుసుకునే సరికి ఆ దేశ మార్కెట్ వ్యవస్థ అంతా కూడా మన చేతుల్లో ఉండాలి అని చెప్పుకుంటూ పోతుండగా... మధ్యలో అరుణ్‌జైట్లీ జోక్యం చేసుకుని... మీరు చెబుతున్నది వింటుంటే చాలా సమ్మగా వుంది. కాని ఆచరణ రూపం దాల్చేదెట్లా? అని అడిగాడు. అందుకు వివేకా... చైనా ఉత్పత్తి చేసిన వస్తువులు చీప్‌గా దొరుకుతున్నాయనే కదా మన వాళ్లు ఎగబడి కొనేది, మన దగ్గర లేనివి వాడు మనకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. అలాగే వాడి దగ్గర లేనివి మన దగ్గర వున్నవి మనం వాడికి అమ్ముదాం, మన సొమ్మును తిరిగి రాబట్టుకుందాం అని చెప్పాడు. మోడీ వుండి... లాజిక్ బాగానే వుంది. దీనిని ఎలా అమలు చేయాలో చెప్పు అని అడిగాడు. వివేకా అందుకు... చైనా వాడికి పాములు, కప్పలు, బొద్దింకలు వంటివి ఆహారం. కొద్ది కాలానికి ఆ దేశంలో ఇవి వుండవు. మన దేశం నిండా ఇవి దండిగా వున్నాయి. అలాగే మా నెల్లూరు ముదురుదోమలు వెరీవెరీ స్పెషల్. అవి ప్రపంచంలో ఇంకెక్కడా దొరకవు. మన దగ్గర దొరికే పాములు, కప్పలు, ముదురుదోమలు వంటి జీవరాశితో పచ్చళ్లు, ఫ్రైలు వంటి ప్రాసెసింగ్ ఫుడ్‌ను తయారుచేసి చైనాకు ఎగుమతి చేద్దాం. మా నెల్లూరు దోమల పులుసుకు ఒకసారి అలవాటు పడ్డారంటే ఇక వదలరు. టన్నుల కొద్దీ దిగుమతి చేసుకుంటూనే వుంటారు. దానికి తగ్గ ఉత్పాదనా సామర్థ్యం కూడా మా నెల్లూరుకు వుంది. మన దోమలు, పాములు, కప్పల ఫుడ్ ఆ విధంగా చైనా మార్కెట్‌ను ఆక్రమిస్తుంది. మన దోమల ఫుడ్‌కు చైనీయులు బానిసలవుతారు. అక్కడి ప్రభుత్వం కూడా మన దోమల పులుసును తినకుండా ప్రజలను నిలువరించలేదు. అలా చేస్తే చైనా కమ్యూనిష్టు ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. కాబట్టి మన ఉత్పత్తులకు చైనాలో విపరీతంగా గిరాకీ పెరిగి, ఆ దేశం డబ్బంతా మన కొచ్చి పడుతుంది. అప్పుడు పాకిస్థాన్‌కు కాదు కదా తమకు తాము సాయం చేసుకునే పరిస్థితిని కూడా ఆ దేశం కోల్పోతుందని చెప్పాడు.

వివేకా చెప్పిందంతా విని అందరూ నోరెళ్లబెట్టారు. రాజ్‌నాథ్ సింగ్ అయితే చూసేదానికి 'సోగ్గాడి'లా కనిపిస్తావు కాని, నీలోనూ మంచి సబ్జెక్ట్ వుందే అని అభినందించాడు. వివేకా చెప్పిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని నిర్ణయించి అందరూ లేచారు.

---

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆర్థిక భారంతో ఇబ్బంది పడతారు. ఇంటా బయట పనుల వల్ల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. వ్యాపారములు సంతృప్తినివ్వలేవు. ఆదాయం తగ్గవచ్చును. వృత్తి ఉద్యోగులకు నిలకడ ఆదాయమైనను ఖర్చులు పెరిగిపోతాయి. నిర్ణయాలు గాని పనులు గాని సొంతంగా జరపండి. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యము, పిల్లల విద్యా వివాహ ఆరోగ్య విషయమై ఆందోళన ఉంటుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఇంటా బయట కొత్త సమస్యలు ఏర్పడవచ్చును. వృత్తి వ్యాపారాలలో స్వల్ప వృద్ధి, సామాన్య ఆదాయముంటుంది. ఆలోచనలు నిలకడగా ఉండక టెన్షన్ పడుతుంటారు. బంధుమిత్రుల వల్ల అనవసర వివాదాలు రావచ్చును. వస్తు నష్టం, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, కొత్త పరిచయాలు బలపడటం జరుగుతుంది. హామీలు అప్పులు ఇవ్వకండి.

## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులను పట్టుదలగా సాధిస్తారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఆదాయం పెరుగుదల ఉంటుంది. కొత్త వ్యాపారాలు, కొత్త నిర్మాణాలు, కొత్త పెట్టుబడులు జరుపుతారు. గృహ వస్తువాహన రిపేర్లు ఖర్చులుంటాయి. ప్రముఖులతో సమావేశాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, విద్యా ప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉంటుంది. చేపట్టిన ప్రయోజనమైన పనులు ముందుకు సాగుతాయి. మనోధైర్యం బాగుంటుంది. కుటుంబంలోని భేదాభిప్రాయాలు సర్దుబాటు కాగలవు. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. స్థిరాస్తులపై ఆదాయము, పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగార్థులు చిత్తశుద్ధితో కృషి చేయండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికంగా స్థిరపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఖరారు కావడం, దూర ప్రయాణాలుండటం జరుగుతుంది. ఆత్మీయులతో ఒక సమస్య పరిష్కారం కాగలదు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి రాబడి పెరుగుతుంది. స్థిరచిత్తంతో సరియైన నిర్ణయాలు తీసికొంటారు. పెట్టుబడి రంగాలలో అవకాశాలు బాగుంటాయి. దైవ సేవా కార్యక్రమాలకు సహాయం చేస్తారు. పరిచయాలు బలపడతాయి. ఫైనాన్స్ వ్యాపారులు, పరిశ్రమ యజమానులకు సమస్యలుండగలవు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 28.10.2016 నుండి
తేది. 3.11.2016 వరకు

ఈ వారం సింహంలో రాహువు, కన్యలో గురువు, తులలో రవి బుధులు, వృశ్చికంలో శని శుక్రులు, కుంభంలో కేతువు, ధనుస్సులో కుజుడు, 1వ తేది నుండి మకరంలో కుజుడు, కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రులుంటారు.

ముహూర్తములు లేవు

**పంచాంగము:**

తేది 29 శనివారము నరకచతుర్దశి.
తేది 30 ఆదివారం దీపావళి అమావాస్య.

**ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | త్రయోదశి | సా॥ గం.5.52ని॥ |
| తేది. 29 | శని | చతుర్దశి | రా॥ గం.7.23ని॥ |
| తేది. 30 | ఆది | అమావాస్య | రా॥ గం.9.16ని॥ |

**కార్తీక మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | సోమ | పాడ్యమి | రా॥ గం.11.20ని॥ |
| తేది. 1 | మంగళ | విదియ | రా॥ గం.1.32ని॥ |
| తేది. 2 | బుధ | తదియ | రా॥ గం.3.34ని॥ |
| తేది. 3 | గురు | చతుర్థి | రా॥ గం.5.21ని॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు, వ్యాపార ఒప్పందాలలో జాగ్రత్త పడండి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. పిల్లల వల్ల కొద్ది సమస్యలు రాగలవు. ఉద్యోగులకు పనిభారం ఉంటుంది. అయినా గుర్తింపు గౌరవాలుంటాయి. నిర్మాణాలు చురుకుగా సాగుతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, అనుకోని ప్రయాణాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి పరంగా అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు ఆశించిన వృద్ధి లేకపోయినా సామాన్య ఆదాయముంటుంది. దూరప్రయాణాలుంటాయి. ఖర్చులు బాగా పెరిగిపోగలవు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. సన్నిహితుల వల్ల, బంధువర్గం వల్ల కొత్త సమస్యలు రావచ్చును.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక స్థితి బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు వేడుకలలో పాల్గొంటారు. పట్టుదలతో అనుకున్న పనులను జరుపుకొంటారు. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. గృహ నిర్మాణాలు రిపేర్లుంటాయి. తప్పనిసరి ప్రయాణాలు జరుపుతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఖర్చులు ఎక్కువగా ఉన్నా ఇబ్బందులుండవు. వ్యవహారాలలో నిష్కర్షగా వ్యవహరించండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. చేపట్టిన పనులు పట్టుదలతో జరుపుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికంగా బాగుండినా ఖర్చులు ఆదాయం సరిపోతుంటుంది. స్వల్పంగా ఋణం చేసినా ఆశ్చర్యం లేదు. వ్యాపార రంగాలకు కొత్త ప్రణాళికలతో సాగుతారు. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. సామాజిక, యూనియన్ కార్యక్రమాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. అనుకున్న పనులు నిదానంగా సాగి టెన్షన్ పడుతుంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబంలో శుభకార్యాలు నిర్ణయం కాగలవు. చేపట్టిన పనులు, పెండింగ్‌లో పనులు సక్రమంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు ఖరారు కాగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అధికారులు, సహచరులు మీకు తోడ్పడగలరు. ఋణ బాధలు, అనారోగ్య సమస్యలు సర్దుబాటు కాగలవు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు నెల్లూరు మధుసూదనరావు - నీరజల కుమారుడు **వంశీకృష్ణ - జాహ్నవి** (చిత్తూరుజిల్లా తలపల గ్రామ వాస్తవ్యులు ముచింతల శివప్రసాద్ - అరుణల కుమార్తె)ల వివాహం ఈ నెల 20వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



గూడూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు, ఎన్‌పిఆర్ హెచ్‌పి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ నాగసూరు గోపాలరావు - వెంకటలక్ష్మీకుమారిల కుమార్తె **మృదుల - సుబ్రహ్మణ్యం** (విశాఖపట్నం వాస్తవ్యులు ఆత్మకూరి లక్ష్మీనారాయణ - ఝాన్సీలక్ష్మిల కుమారుడు)ల వివాహం ఈ నెల 19వ తేదీ గూడూరు దివ్య ఫంక్షన్‌హాల్ నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# గుండెలకే పని చెప్పే గురువు!



*అతని చేతిస్పర్శ తగిలితే చాలు.. ఆగుతున్న గుండెలు కదులుతాయి. బద్ధకంగా పనిచేసే గుండెలు పరుగులు తీస్తాయి. అతిగా పనిచేస్తున్న గుండెలు ఆలోచనతో పనిచేస్తాయి. అలసిపోయిన గుండెలు కొత్త ఉత్సాహాన్ని తెచ్చుకుంటాయి. అతను గుండెల పాలిట స్పీడ్‌కంట్రోలర్! వేగంగా పరుగెత్తే గుండెలను, నిదానంగా పరుగెత్తే గుండెలను ఒక దారిలోకి తెచ్చి ఒకే వేగంతో పరుగులు తీయించే హార్ట్‌ట్రైనర్. చక్కగా పనిచేసే గుండెలకు మంచి శిక్షకుడు. క్రమశిక్షణ తప్పి తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న గుండెల పాలిట శత్రువు. గుండెలకే గురువుగా మారిన ఆ వ్యక్తే.... డాక్టర్ చేజర్ల శేషాచల శ్రీనివాసరాజు.*

నెల్లూరీయులకు మాత్రం డాక్టర్ సి.ఎస్.రాజుగా సుపరిచితుడు. నెల్లూరులోని ఒకప్పటి బొల్లినేని ఆసుపత్రి, ప్రస్తుత 'కిమ్స్' ఆసుపత్రిలో చీఫ్ కార్డియాలజిస్ట్. నెల్లూరులో గుండెకు సంబంధించి సమస్య ఎవరికైనా వస్తే ముందుగా గుర్తొచ్చే పేరు డాక్టర్ సి.ఎస్.రాజు! వ్యక్తయినా, యంత్రమైనా 24గంటలూ పనిచేయలేవు. కాని మనిషిలోని గుండె మాత్రం 24గంటలూ పనిచేస్తూనే వుంటుంది. అది పనిచేయడం మానేస్తే మనిషి పని అయిపోయినట్లే! క్షణం తీరిక లేకుండా 24 గంటలూ పనిచేసే గుండెలకే పనిచెప్పే ట్రైనర్ శ్రీనివాసరాజు.

2,67,477 మంది అవుట్‌పేషంట్లు, 34,643మంది ఇన్‌పేషంట్లు, 20,162మందికి యాంజియోగ్రామ్స్, స్టంట్స్, 2,15,296మందికి ఇసిజి పరీక్షలు, 1,39,741 మందికి 2డి ఎకో పరీక్షలు, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో 5175 రకాలైన గుండె ఆపరేషన్లు... ఇప్పటిదాకా 20వేల గుండె శస్త్ర చికిత్సలు... ఇవి కాగితాల మీద లెక్కలు. కాకి లెక్కలు కావు. బొల్లినేని ఆసుపత్రిలో డాక్టర్ శ్రీనివాసరాజు పేరిట నమోదైన ట్రాక్ రికార్డు. కేవలం 16ఏళ్లలోనే గుండెవ్యాధుల వైద్యరంగంలో సాధించిన అరుదైన రికార్డు. ఒక హృద్యోగ వైద్యనిపుణుడిగా ఆయన ఇన్ని లక్షల మంది గుండెల్లో నిలిచిపోయారు.

నెల్లూరులో బొల్లినేని ఆసుపత్రికి ఎన్ని పిల్లర్లున్నాయో తెలియదుగాని, ప్రధాన పిల్లర్ మాత్రం శ్రీనివాసరాజు మాత్రమే! ఆసుపత్రి ప్రారంభం నుండే ఆయన ఇక్కడ పనిచేస్తున్నారు. ఇక్కడికి వచ్చే హృద్రోగులతో మమేకమయ్యారు. గుండె సమస్యలతో వచ్చే వారికి ఆయనే గుండెధైర్యమయ్యారు. మీ గుండెలను భద్రంగా చూసుకోవడానికి నేనున్నానని అభయమిచ్చారు. చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలలో వున్న కార్పొరేట్ ఆసుపత్రుల నుండి ఎన్నెన్నో ఆఫర్లు వచ్చినా డబ్బు కంటే వృత్తిలో విలువలే ముఖ్యమనుకున్నాడు. తనను నమ్మిన బొల్లినేని ఆసుపత్రిలో సేవలందించడానికే అంకితమయ్యాడు.

వైద్యాన్ని వ్యాపారం కోణంలో కాకుండా మానవతా కోణంలోకి మళ్లించాడు. నెల్లూరు, ప్రకాశం, కడప, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో గుండెవ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి, ప్రజల్లో గుండెవ్యాధులపై అవగాహన పెంచారు. నెల్లూరుజిల్లాలో రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం సారథ్యంలో చిన్నారి హార్ట్‌ఫౌండేషన్ ద్వారా దాదాపు 150మంది చిన్నారులకు ఉచితంగా గుండెశస్త్రచికిత్సలు నిర్వహించగా, అందులో శ్రీనివాసరాజు నిర్వహించిన మానవీయ పాత్ర అనిర్వచనీయమనే చెప్పొచ్చు. పలు స్వచ్ఛంధ సంస్థలు, సంఘాలు నిర్వహించే సదస్సులకు హాజరై గుండెకు సంబంధించిన జాగ్రత్తలు చెబుతుంటారు. ఇక వాత్సల్య, హెల్పింగ్‌హ్యాండ్స్ వంటి సేవాసంస్థల కార్యక్రమాలలో తాను కూడా భాగస్వామి అవుతుంటాడు. నెల్లూరుజిల్లాలో గుండెవ్యాధిగ్రస్తులకు లభించిన వైద్యవరం శ్రీనివాసరాజు. లక్షలాది గుండెలలో నిలిచిపోయిన మనసున్న మారాజు.. ఈ రాజు!

# సింహపురి సాహిత్యానికి సత్కారం



తెలుగు తేజం పత్రిక 8వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి విశిష్ట పురస్కారాలతో పాటు సత్కారాలు చేసిన తెలుగుతేజం ఫౌండేషన్ నెల్లూరు సాహితీ రంగంలో తనదైన శైలితో రచనలు చేస్తున్న డాక్టర్ పెళ్ళకూరు జయప్రదకు గౌరవ సత్కారం అందించింది. అక్టోబర్ 23న బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శ్రీమతి ఆకురాతి పల్లవి, ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్, తెలుగుతేజం గౌరవపోషకులు, సేవా భారత్ ట్రస్ట్ అధ్యక్షుడు బండి ఆదినారాయణరెడ్డి, తెలుగుతేజం ప్రచురణకర్త బొగ్గవరపు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.


# చిత్రాలకు జీవం పోసింది






అరుణకుమారి చిత్రించిన పలు చిత్రాలు జీవం ఉట్టిపడేలా వున్నాయని, ఆమె తన కళను రంగరించి వడపోసి అద్భుతంగా మలిచారని నెల్లూరు స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.కళాసాగర్ అన్నారు. ఈ నెల 21వ తేదీన నెల్లూరు టౌన్‌హాల్ సమావేశ మందిరంలో అరుణకుమారి చిత్రకళ ప్రదర్శన రెండవ సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పల్లెల జీవన విధానాన్ని, ప్రకృతి అందాలను, కష్ట జీవులను, దేవతామూర్తులను ఆమె కళానైపుణ్యంతో చిత్రించారని అభినందించారు. చిత్రకారిణి అరుణకుమారి మాట్లాడుతూ తన గురువు పైడా వరప్రసాద్ తన కళలను పర్యవేక్షిస్తూ తనను గొప్ప కళాకారిణిగా తీర్చిదిద్దినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరు తన కళలను ఆదరించాలని కోరారు. విద్యార్థులు, నెల్లూరు నగర ప్రజలు, డా॥ మంజులమ్మ, జడ్.శివప్రసాద్, టి.కృష్ణారెడ్డి, పి.శ్రీనివాసరావు, సిహెచ్ కృష్ణవేణి, గంధవళ్ళ ఉమాశంకర్, షేక్ ముసవ్వీర్, హరనాథ్, సురేష్‌బాబు, అలేఖ్య, పాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అరుణకుమారి చిత్రాల్లో దేవతామూర్తులు ప్రత్యక్షమౌతారు, పల్లెభామలు పలుకరిస్తారు. ఆమె గీసిని చిత్రాలు మీతో మాట్లాడుతాయి. మీ మనసుల్ని దోచేస్తాయి. మీలోని కళాత్మక దృష్టిని ఆకర్షిస్తాయి. ఈ చిత్రాల్లోని ప్రత్యేకత ఇదే. కాదేది కళ కనర్హం అన్నట్లుగా ఆమె కుంచె నుండి జాలువారే ప్రతి చిత్రం కళ్లకు కట్టినట్లు అద్భుతంగా ఉంటుంది. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్‌లోని బాలాజీ మానర్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఎస్.అరుణకుమారి ప్రముఖ కంటివైద్య నిపుణులు డాక్టర్ ప్రేమ్‌చంద్ సతీమణి. యంఎ బిఇడి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసిన అరుణకుమారి వివాహం అనంతరం ఇంటికి పరిమితం కాకుండా అనేక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటూ సేవలు అందిస్తున్నారు. ప్రముఖ చిత్రకారుడు పైడా వరప్రసాద్ వద్ద చిత్రకళలో శిక్షణ తీసుకున్నారు. 2012 ఆగస్టు 11వ తేదీన అరుణకుమారి సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహించారు. అదే ఏడాది నంద్యాలలో కోటీష్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి చిత్రకళా పోటీల్లో పాల్గొని "చిత్ర కళాప్రపూర్ణ" పురస్కారాన్ని అందుకున్నారు. తంజావూరు పెయింటింగ్, ఆర్కిలిక్స్ పెయింట్స్, ఆయిల్ పెయింట్స్, గ్లాస్ పెయింటింగ్‌ల చిత్రాలు సజీవ దృశ్యంతో మనతో మాట్లాడినట్లు ఉంటాయి. చిత్రకారిణిగా ఎన్నో అవార్డులు, సత్కారాలు అందుకుంటున్న అరుణకుమారి సింహపురి కీర్తిప్రతిష్టలను దేశం నలుమూలలా విస్తరింపజేయాలని ఆశిద్దాం!













ఈ నెల 26వ తేదీన నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద రొట్టెల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన నాణ్యత లేని పనులను పరిశీలిస్తున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

# శాంతికి నిలయం భారతదేశం



భారతదేశం శాంతికి నిలయమని, అయినా ఉగ్రవాదులు మిలిటెంట్లు, మతవాదులు ప్రపంచంలో అరాచకాలు సృష్టిస్తూ వేలమంది ప్రాణాలు తీస్తున్నారని, ఉగ్రవాదానికి స్వస్తి చెప్పి ప్రపంచ శాంతిని కోరుకోవాలని ఆచార్య ఆదిత్య అన్నారు. ఈ నెల 24వ తేదీన కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో ప్రపంచ శాంతి దినోత్సవ కార్యక్రమానికి ఆయన సభాధ్యక్షులుగా వ్యవహరించి మాట్లాడారు. అనంతరం ప్రజాసేవకుడు నీళ్ల వెంకయ్యను ముఖ్యఅతిథులు శాలువ, పూలమాలతో సత్కరించారు. గురుకృప కళాక్షేత్రం విద్యార్థినుల నృత్యప్రదర్శనలు, నరేష్ డ్యాన్స్ అకాడమీ వారిచే నృత్యాలు, బాలాజీ ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరి అందరిని ఆకట్టుకున్నాయి. అతిథులుగా వాస్తు రామచంద్ర, గాదంశెట్టి గోపాల్, దంతం శ్రీనివాసులు, శ్రీహరి రాయులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణను కేతా సుబ్బారావు నిర్వహించారు.

# వెంకయ్యనీ వదలని అనిల్



నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ రాజకీయ విమర్శలు చేయడంలో ఎవరినీ వదలడం లేదు. జిల్లాలో మంత్రి నారాయణ మీద విమర్శల దాడి మొదలుపెట్టింది అతనే! పలు సందర్భాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కూడా పదునైన విమర్శలతో విరుచుకుపడ్డాడు. తాజాగా కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడుకు గురిపెట్టాడు. జిల్లాలో ఏ పార్టీ నాయకులైనా తొందరపడి వెంకయ్య మీద విమర్శలు చేయరు. పార్టీల పరంగా ఎన్ని తిట్టుకున్నా వ్యక్తిగతంగా వెంకయ్యను వేలెత్తి చూపరు. కాని అనిల్ మాత్రం తన దూకుడు తగ్గించలేదు. నెల్లూరు రిత్విక్ లేఅవుట్‌లోని 16 సెంట్ల విలువైన స్థలాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ పేరుతో కాజేస్తున్నారంటూ గట్టిగానే విమర్శించారు. ఈ రిజర్వు స్థలంలో స్వర్ణభారత్ ట్రస్ట్ తరపున దంత వైద్యశాల, కంటి వైద్యశాలను నిర్మిస్తామని, భవనాలు కట్టాక కార్పొరేషన్‌కే అప్పగిస్తామని ట్రస్ట్ నిర్వాహకులు చెబుతున్నారు.

సేవా కార్యక్రమాల కోసం ఈ స్థలాన్ని ఉపయోగిస్తే ఆక్షేపించాల్సిందేమీ లేదు. కమర్షియల్ కాంప్లెక్సులు కట్టి బాడుగలకు ఇచ్చుకుంటేనే తప్పు పట్టాలి.

## వైఎస్సార్‌నగర్‌లో కొత్త ఇళ్ళను నిర్మిస్తాం

నెల్లూరు రూరల్‌లోని కొత్తూరు వైఎస్సార్‌నగర్‌లో నిర్మించిన చాలా ఇళ్ళు నివాసయోగ్యంగా లేవని, అందువల్ల వాటి స్థానంలో కొత్తఇళ్ళను నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి అన్నారు. వైఎస్సార్ నగర్‌లో ఈ నెల 22న ఆదాల పర్యటించి అక్కడున్న ఇళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలా చోట్ల ఖాళీ స్థలాలు వున్నాయని, వాటిలో నగరంలో కాలువల గట్లమీద నివసిస్తూ నివాసాలు కోల్పోయినవారికి వసతి కల్పించేందుకు కృషి చేస్తామని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. బోగస్ పట్టాలను కొనుగోలుచేసి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదాలతో పాటు విజయడెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, గ్రంథాలయసంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఈ నెల 23న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన ఓ కార్యక్రమంలో బేబి యశస్వినిని సన్మానిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, పక్కన మునికుమార్, ధర్మరాజస్వామి ఆలయ కమిటీ సభ్యులు వరదా పవన్‌కుమార్ తదితరులు

# అవినీతి గద్దలు

(మొదటి పేజీ తరువాయి)

కాకులను కొట్టి గద్దలకు వేసినట్లుగా బ్యాంకులు పేదల నుండి సేకరించిన డిపాజిట్లను వందలు వేలు కోట్లు పోగు చేసి పెద్దలనబడే కార్పొరేట్ గద్దలకు లోన్‌గా ఇస్తున్నాయి. పేదవాడు 50వేల రూపాయలు ఋణం అడిగితే లక్షా 50వేల ఆస్తి గ్యారంటీ పెట్టుకుని ఇచ్చే బ్యాంకులు.. ఈ కార్పొరేట్ గద్దలకు మాత్రం తాత్కాలిక సెక్యూరిటీతో వందలు, వేల కోట్లు అప్పులిస్తుంటాయి. పేదోడి దగ్గర వున్న ఎకరా భూమికి మార్కెట్‌లో లక్ష రూపాయలు విలువ వుంటే ఈ బ్యాంకుల్లో దానిని 50వేలుగానే చూస్తారు. అదే పారిశ్రామిక వేత్త వద్ద లక్ష విలువ చేసే ఎకరా భూమికి మాత్రం 50లక్షల విలువ కట్టి మరీ ఋణాలిస్తారు. ఈ పారిశ్రామికవేత్తలు తీసుకున్న వందలు, వేల కోట్ల అప్పులను తిరిగి చెల్లించలేనప్పుడు, వీరు సెక్యూరిటీగా పెట్టిన ఆస్తుల విలువకు, వారు పడ్డ బకాయిలకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా వుంటుంది. ఉదాహరణకు ఒక పారిశ్రామికవేత్త ఒక బ్యాంకుకు వందకోట్లు బకాయి పడ్డాడంటే, అతను బ్యాంకులో పెట్టిన సెక్యూరిటీ ఆస్తుల విలువ 10 కోట్లు కూడా ఉండదు. కేవలం బ్యాంకు యాజమాన్యాలను మెయింటేన్ చేసి తమ ఆస్తులకు రిజిష్టర్ విలువ పెంచి చూపించి వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి చివరకు బ్యాంకులకు కుచ్చుటోపీ పెడుతున్నారు.

దేశవ్యాప్తంగా ఈరోజు ఎంతోమంది రాజకీయ పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు వేలకోట్లు బకాయిపడివున్నారు. మోడరన్ ప్రపంచపు మారాజు విజయ్‌మాల్యా బ్యాంకులకు 9వేల కోట్లు బకాయిలు కట్టాలి. ఈయనగారి మొత్తం ఆస్తులు జప్తు చేసినా ఆ 9వేల కోట్లు రావు. ఈయనకు అప్పులివ్వడానికి బ్యాంకులు ఒక దానితో ఒకటి పోటీపడ్డాయి. తమ బ్యాంకులో మాల్యా లోన్ తీసుకోవడాన్ని దేవుడిచ్చిన వరంగా భావించాయి. ఆ వరమే ఇప్పుడు బ్యాంకుల పాలిట శాపమైంది.

అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ పారిశ్రామికవేత్తలు కేంద్రమంత్రి సుజనాచౌదరి, నామా నాగేశ్వరరావు, సీఎం రమేష్, రాయపాటి సాంబశివరావు, లగడపాటి రాజగోపాల్ వంటి వాళ్లు బ్యాంకులకు వందలు, వేల కోట్లలోనే బకాయిలు పడివున్నారని తెలుస్తోంది. ఇలాంటి కేసులన్నీ వేలకోట్లలో చేతులెత్తేస్తే దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ పరిస్థితేంటి? ప్రపంచంలోనే మన దేశ బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో పటిష్టమైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు మన బ్యాంకింగ్ వెన్నెముక! భారతీయుల్లో ఉండే పొదుపు గుణం మన బ్యాంకింగ్ వ్యవస్థకు మూలస్థంభం. మరి బ్యాంకులు ఇలా ఎగవేతదారులకు వేలకోట్లు ఇచ్చుకుంటూ పోతే బ్యాంకులు మదుపర్ల విశ్వాసం కోల్పోవా? డిపాజిటర్లు నమ్మకం కోల్పోయి బ్యాంకు లావాదేవీలను మానుకుంటే బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత దారుణంగా తయారవుతుంది?

# బెర్త్ ఖాయం..?

(మొదటి పేజీ తరువాయి)

ఇక మంత్రివర్గంలో నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో పార్టీ అవసరాల దృష్ట్యా గాని, 2019 ఎన్నికల కోణంలోగాని ప్రజల మధ్య వుండే సోమిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం సముచితమని భావిస్తున్నారు. నెల్లూరుజిల్లాకు సంబంధించి నారాయణ మంత్రిగా వున్నప్పటికీ లేనట్లే లెక్క! మంత్రిగా జిల్లా ప్రజలకు గాని, కనీసం తన పార్టీకి గానీ ఆయన పొడిచిందేమీ లేదు. అదీగాక మంత్రిగా నారాయణ నిర్వాకంతో జిల్లాలో తెలుగుదేశంపార్టీ బాగానే దెబ్బతింది. ఏళ్ల తరబడి పార్టీని కనిపెట్టుకుని పని చేస్తున్న వాళ్లు కూడా ఆయన మూలంగా పార్టీపై అసంతృప్తి పెంచుకునే పరిస్థితి వచ్చింది. ఇదే పొజిషన్‌లో 2019 ఎన్నికలకు వెళితే జిల్లాలో తెలుగుదేశంపార్టీ చావుదెబ్బ తినడం ఖాయం. 2014లో వైసిపి నాయకత్వ లోపం వల్ల జిల్లాలో టీడీపీకి మూడు స్థానాలన్నా దక్కాయి. ఈసారి వాటి మీద కూడా ఆశ ఉండదు. జిల్లాకు సంబంధించి మంత్రిగా నారాయణ వున్నప్పటికీ పార్టీకి ఎటువంటి పొలిటికల్ మైలేజీ రావడం లేదు. ఆయన మూలంగా పార్టీకి అదనంగా వచ్చిన ఓట్లేమీ లేవు.

సోమిరెడ్డికి మంత్రి పదవి ఇస్తే కనీసం పార్టీని నమ్ముకుని వున్న కేడర్‌ను కాపాడుకోగలడు. కొత్త కేడర్‌ను రాబట్టగలడు. జిల్లాలో పార్టీకి అందుబాటులో వుంటాడు. పార్టీ కార్యక్రమాలలో ముందుంటాడు. మంత్రిగా ప్రజలకి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కనిపిస్తుంటాడు. వారి సమస్యలకు స్పందిస్తుంటాడు. సోమిరెడ్డికి మంత్రి పదవిని పార్టీలోని పాత నాయకులతో పాటు ఇటీవల పార్టీలో చేరిన నాయకులు కూడా సమర్ధిస్తున్నారు. సీనియర్ నాయకుడిగా ఆయనకు తగిన గౌరవమివ్వాలని అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో తెలుగుదేశం బలహీనంగానే వుంది. ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాలలో తప్పితే ఇంకెక్కడా పార్టీ పరిస్థితి ఆశాజనకంగా లేదు. చంద్రబాబు దృష్టికి ఈ విషయం వెళ్లింది. సోమిరెడ్డి మంత్రి అయితే జిల్లాలో పార్టీ పరిస్థితి మెరుగవుతుందన్న ఆలోచనతో ఆయనున్నారు. ఈ నేపథ్యంలోనే సోమిరెడ్డికి అవకాశాలు మెరుగైనట్లు తెలుస్తోంది. దీపావళి తర్వాత దేశం కార్యకర్తలు శుభవార్త వినొచ్చు.

# నెల్లూరులో అభినవ మాల్యా

(మొదటి పేజీ తరువాయి)

చేసానని చెప్పుకునే శాసనమండలి సభ్యులు, పారిశ్రామికవేత్త కూడా అయిన వాకాటి నారాయణరెడ్డి కూడా వివిధ బ్యాంకుల్లో 1098కోట్లు బకాయిలు కట్టాలి. మొత్తం బ్యాంకుల నుండి ఆయన 1538కోట్లు ఋణంగా తీసుకోగా 400 కోట్ల పైనే చెల్లించారు. మిగిలిన బకాయిలు కట్టాలి. గత కొన్నేళ్లుగా బకాయిలు కట్టకపోతుండడంతో బ్యాంకులు ఆయనకు నోటీసులు కూడా జారీ చేశాయి. ఒకప్పుడు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన కాంగ్రెస్‌పార్టీలో పలు పదవులు నిర్వహించారు. నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా పనిచేసి, ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన ఆయన ఎన్నికల తర్వాత అధికార తెలుగుదేశంలో చేరి, చంద్రబాబుకు ఆసాంతం చెక్కభజన చేస్తున్నారు.

ఇది రాజకీయ కోణమైతే పారిశ్రామికవేత్తగా, కాంట్రాక్టర్‌గా, వ్యాపారవేత్తగా పలుకోణాలున్నాయి. వివిఎన్‌ఆర్ ఇన్‌ఫ్రా, వివిఎన్‌ఆర్ రైల్ కంపెనీ, వివిఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్... వంటి పేర్లతో పలు కంపెనీలను పెట్టి కొన్నింటిలో మేనేజింగ్ డైరెక్టర్‌గానూ, మరికొన్నింటిలో డైరెక్టర్‌గానూ కొనసాగుతున్నారు. వ్యాపార కార్యకలాపాల కోసంగా బ్యాంకుల నుండి 1538 కోట్లు ఋణం తీసుకున్నాడు. ఈరోజు 1098కోట్లు బ్యాంకులకు కట్టాలి. బ్యాంకులకు టోపీ పెట్టే రాజకీయ గద్దల జాబితాలో ఆయన కూడా ఒకడయ్యాడు. నెల్లూరుజిల్లా చరిత్రలో ఇదే పెద్ద అక్రమం. జిల్లాలో మాగుంట, వేమిరెడ్డి, ఎన్‌డిఆర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలెందరో వున్నారు. వీరి బ్యాంకు లావాదేవీలన్నీ సజావుగా సాగుతున్నాయి. ఒక్క వాకాటి బ్యాంకులకు నిలువునా బకాయిపడ్డాడు. వెయ్యి కోట్లంటే మాటలా... ఎందరి రక్తమిది. ఎందరి స్వేదమిది. ఎందరి శ్రమ ఫలితమిది. పేదలు, మధ్యతరగతి ప్రజలను పీల్చి పిప్పిచేసి దండిన డబ్బులను ఇలా రాజకీయ రాబందుల పాలు చేస్తున్నారు. బ్యాంకులకు వేలకోట్లలో టోపీలు పెట్టిన వాళ్లంతా అధికారపార్టీల ఆశ్రయం పొందుతున్నారు. ఇలా అయితే ఈ ఆర్థిక వ్యవస్థ నిలిచేదెట్లా? బ్యాంకింగ్ వ్యవస్థ మనుగడ సాగించేదెలా?

వాకాటి అప్పుల ఎగవేతపై టివి9 బిజినెస్ న్యూస్‌లోనూ పెద్ద కథనమే వచ్చింది. దీనిపై ఆర్థిక మేధావుల చర్చా కార్యక్రమం జరగగా, ఇలాంటి పొలిటికల్ ఎగవేతలపై వాళ్ళు తీవ్రంగానే విరుచుకుపడ్డారు. టివి9లో వార్త రాగానే వాకాటి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని టివి9 ప్రధాన కార్యాలయంలోకి వెళ్లి వాళ్ళను బ్రతిమలాడుకుని ఆ వార్తను ఆపుచేయించడమే కాకుండా, యూట్యూబ్‌లోనూ ఆ వార్తలకు సంబంధించిన చిత్రాలను తీసేయించగలిగాడు.

టీవీలలో, పేపర్లలో వార్తలు రాకుండా ఆపినంత మాత్రాన వాకాటి ప్రిస్టేజీ నిలబడేది ఏమీ లేదు. కాని తీసుకున్న అప్పులను సరిగా కడితే ఈ ప్రయాస ఉండేది కాదుకదా!

# ద్వితీయ వర్ధంతి



అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరచుకుని,
నిండు నూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాల దీప్తి,
మా అభివృద్ధికి కారకురాలు, దైవసమానురాలు

## కీ॥ శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

పరమపదించి తేది 30-10-2016 నాటికి
రెండేళ్ళు పూర్తికానున్న సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

**కుమారులు - కోడళ్ళు**

గునుపాటి వెంకటకృష్ణారెడ్డి - ఇందిరమ్మ
గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్‌రెడ్డి - శుభప్రదమ్మ

**కుమార్తెలు - అల్లుళ్ళు**

కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి
దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి

**మరియు మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com